మా కలం.. మీ గళం..

RNI : APTEL/ 2017/74310

# మన గళం

దిన పత్రిక

## మంత్రులు, నేతలతో డైరెక్టర్ నగరూరు రాఘువేంద్ర భేటీ



8లో..

పబ్లిషర్స్ : ఆంధ్రప్రదేశ్, తెలంగాణ   ఎడిటర్ : నంద కిషోర్   సంపుటి : 08   సంచిక : 90   గురువారం   11 - 09 - 2025   పేజీలు: 8   వెల: 4

## ఆదోని జిల్లా ఏర్పాటుకు సహకరించండి

- ఆదోని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి
- మంత్రి సత్యకుమార్,రాష్ట్ర భాజపా అధ్యక్షుడు మాధవ్ లకు వినతిపత్రం



(మన గళం,కర్నూలు) : ఆదోని జిల్లా ఏర్పాటుకు సహకరించాలని ఆదోని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి వాల్మీకి కోరారు. ఈ మేరకు ఎమ్మెల్యే రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్, రాష్ట్ర భాజపా అధ్యక్షుడు మాధవ్ లకు వినతిపత్రం సమర్పించారు. బుధవారం అనంతపురంలో ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి వారిని కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను ఎమ్మెల్యే గా ప్రాతినిధ్యం వహిస్తున్న ఆదోనిని జిల్లాగా ఏర్పాటు చేయాలని, అందుకు సహకరించాలని వారిని కోరారు. ఈ కార్యక్రమంలో ఏ.పి.ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ నగరూరు రాఘువేంద్ర,భాజపా నేతలు చంద్రమౌళి,పోలంకి రామస్వామి, తదితరులున్నారు.



## ఉమ్మడి కర్నూలు జిల్లా ఎంపీ ల భేటీ

మనగళం, కర్నూలు సిటీ : ఉమ్మడి కర్నూలు జిల్లా ఎంపీలు భేటీ అయ్యారు. కర్నూలు నగరంలోని తన కార్యాలయంలో ఎంపీ బస్తిపాటి నాగరాజు, నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి సమావేశమాయ్యారు. ఈ సందర్భంగా ఉమ్మడి కర్నూలు జిల్లాలోని తాజా రాజకీయాలతో పాటు ఉప రాష్ట్రపతి ఎన్నికలో ఎన్డీఏ అభ్యర్థి రాధాకృష్ణన్ విజయంపై చర్చించారు. అనంతరం అనంతపురంలో నిర్వహిస్తున్న సూపర్ సిక్స్ సూపర్ హిట్ సభకు ఇద్దరు ఎంపీలు కలిసి వెళ్లారు.



## పాకిస్థాన్‌లో మోటార్‌సైకిళ్ల ఉత్పత్తిని నిలిపేసిన యమహా

- వ్యాపార విధానాల్లో మార్పుల వల్లే ఈ నిర్ణయమన్న కంపెనీ
- దేశంలో నెలకొన్న అనిశ్చితితో కార్యకలాపాలకు బ్రేక్

మన గళం డెస్క్ : ప్రముఖ ఆటోమొబైల్ దిగ్గజం యమహా పాకిస్థాన్‌లో తమ కార్యకలాపాలకు సంబంధించి సంచలన నిర్ణయం తీసుకుంది. దేశంలో నెలకొన్న అనిశ్చితి పరిస్థితుల నేపథ్యంలో, తమ మోటార్‌సైకిళ్ల తయారీని నిలిపివేస్తున్నట్లు అధికారికంగా ప్రకటించింది. వ్యాపార విధానాల్లో చేపడుతున్న మార్పుల్లో భాగంగానే ఈ నిర్ణయం తీసుకున్నట్లు కంపెనీ వెల్లడించింది. గత కొంతకాలంగా పాకిస్థాన్‌లో అనేక కంపెనీలు వ్యాపార నిర్వహణలో సవాళ్లను

2 లో..

## ఎంత యూరియా కావాలో అంతే వాడండి



- మనం అడిగిన వెంటనే కేంద్రం యూరియా అందిస్తోంది
- ఎన్ని ఆర్థిక కష్టాలున్నా రైతులకు అండగా నిలుస్తాం
- ఆటో డ్రైవర్లకు సీఎం చంద్రబాబు దసరా కానుక
- ఒక్కొక్కరికి రూ 15 వేలు..
- సూపర్ సిక్స్-సూపర్ హిట్' తొలి బహిరంగ సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు



మన గళం, అనంతపురం : ఏ రైతుకూ యూరియా కొరత రాకుండా నేను చూసుకుంటాను. ఎంత యూరియా కావాలో అంతే వాడండి. మనం అడిగిన వెంటనే కేంద్రం యూరియా అందిస్తోంది అని హామీ ఇచ్చారు. ఎన్ని ఆర్థిక కష్టాలున్నా రైతులకు అండగా నిలుస్తామని సీఎం చంద్రబాబు హామీ ఇచ్చారు. సూపర్ సిక్స్-సూపర్ హిట్' పేరుతో అనంతపురంలో నిర్వహించిన తొలి బహిరంగ సభలో ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కీలక ప్రసంగం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కూటమిలో మూడు పార్టీల కార్యకర్తల స్పీడ్‌తో సపరిపాలనలో ఏపీ ప్రభుత్వాన్ని అడ్డే లేదన్నారు సీఎం చంద్రబాబు. రైతు బాగుంటేనే సమాజం బాగుంటుంది. మనకు అన్నంపెట్టేది అన్నదాత. రైతన్నకు అండగా ఉండేందుకే అన్నదాత సుఖీభవ పథకం తెచ్చామని చంద్రబాబు గుర్తు చేశారు. కేంద్రంతో కలిసి ఏడాదికి 3 విడతల్లో రూ. 20 వేలు ఇస్తామన్నామని, తొలి విడతగా ఇప్పటికే రూ. 7 వేలు ఇచ్చామని, 47 లక్షల మంది రైతులకు రూ.3,173 కోట్లు జమ చేశామని సీఎం చంద్రబాబు తెలిపారు. నీళ్లిచ్చాం%ొ% మైక్రో న్యూట్రియంట్స్ ఇచ్చాం.. మార్కెట్ గిట్టుబాటు ధర వచ్చేలా చేశాం. ఏ రైతుకూ యూరియా కొరత రాకుండా నేను చూసుకుంటాను. ఆర్థిక కష్టాలున్నా అండగా నిలిచాం కాబట్టే 'అన్నదాత సుఖీభవ' సూపర్ హిట్ అని చంద్రబాబు స్పష్టం చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో దీపం పథకం తెచ్చి మహిళల వంటింటి కష్టాలు తీర్చామని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. నేడు మళ్లీ దీపం-2 పథకం ద్వారా ఉచితంగా ఏటా 3 సిలిండర్లు ఇస్తున్నామన్నారు.

2 లో..

## భారత్-నేపాల్ సరిహద్దులో ఉద్రిక్తత..



- అల్లర్ల నేపథ్యంలో భారత్-నేపాల్ సరిహద్దులో భద్రత కట్టుదిట్టం
- సరిహద్దుల్లో పౌరుల రాకపోకలపై కఠిన ఆంక్షలు.. నిలిచిన వాణిజ్యం

మన గళం, న్యూఢిల్లీ : పొరుగు దేశం నేపాల్‌లో నెలకొన్న తీవ్ర రాజకీయ సంక్షోభం ప్రభావం భారత్‌పై పడింది. అవినీతి, ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా యువత చేపట్టిన హింసాత్మక నిరసనలతో ఆ దేశం అట్టుడుకుతోంది. ప్రజాందోళనల ధాటికి ప్రధాని కేపీ శర్మ ఓలీ తన పదవికి రాజీనామా చేశారు. ఈ పరిణామాల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా భారత్ తన సరిహద్దుల్లో భద్రతను కట్టుదిట్టం

2 లో..

## నేపాల్ బాధితులను క్షేమంగా రాష్ట్రానికి తీసుకొస్తాం

- నేపాల్‌లో ఆందోళనల కారణంగా చిక్కుకుపోయిన 241 మంది ఏపీ వాసులు
- బాధితులతో వీడియో కాల్‌లో మాట్లాడి ధైర్యం చెప్పిన మంత్రి లోకేశ్



మన గళం, అమరావతి : నేపాల్‌లో జరుగుతున్న ఆందోళనల కారణంగా రాజధాని ఖాట్మండులో చిక్కుకుపోయిన మంగళగిరి వాసులతో రాష్ట్ర ఐటీ, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్ నేరుగా మాట్లాడారు. వీడియో కాల్ ద్వారా వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకుని, ప్రభుత్వం అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు. నేపాల్‌లో మొత్తం 241 మంది ఏపీకి చెందిన యాత్రికులు చిక్కుకున్నట్లు అధికారులు ప్రాథమికంగా

2 లో..

## రాష్ట్రంలో ప్రభుత్వం ఉందా..?

- పాలన ప్రజల కోసమా.. దోపిడీదారుల కోసమా..?
- కుప్పంలోనూ రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారు




మన గళం, అమరావతి : ఏపీలో కూటమి ప్రభుత్వంపై వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని మండిపడ్డారు. గత ఏడాదిగా ఏ పంటకూ గిట్టుబాటు ధర రావడం లేదన్నారు. ఉల్లి, టమాటా, చీని రైతుల పరిస్థితి దారుణంగా ఉందన్నారు. తమ ప్రభుత్వ హయాంలో రైతులు ఎన్నడూ రోడ్డెక్కలేదని జగన్ తెలిపారు. 'ఏపీలో రైతులకు ఎరువులు అందట్లేదు. యూరియా కొరత తీవ్రంగా ఉంది. రైతుల కోసం రాష్ట్రవ్యాప్తంగా ధర్నాలు చేశాం. ప్రభుత్వం ఉందా..? లేదా..? అనే సందేహం కలుగుతోంది. దోచుకో, పంచుకో, తినుకో అన్నవిధంగా ప్రభుత్వ తీరు ఉంది. ప్రభుత్వం కనీస బాధ్యతను కూడా నిర్వర్తించడం లేదు. లాండ్ ఆర్డర్ మెయింటేన్ చెయ్యట్లేదు. ప్రజలు గొంతు విప్పే పరిస్థితి లేదు. రెడ్ బుక్ అంటూ

2 లో..

## ఎటుచూసినా మంటలే.. సాయం చేయండి

- నేపాల్‌లో భారత పర్యాటకురాలు..!



మన గళం, ఇంటర్నెట్ డెస్క్: నేపాల్ లో జెన్-జడ్ నిరసనలు హింసకు దారితీశాయి. నిరసనకారులు దేశవ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తులకు నిప్పటించారు. ప్రధాని, మాజీ ప్రధానులు, మంత్రుల ఇళ్లకు కూడా నిప్పుపెట్టారు. ఆ ఇళ్లలో దొరికిన వారిపై దాడులకు పాల్పడ్డారు. దాంతో ఆ దేశంలో పరిస్థితులు భయానకంగా ఉన్నాయి. పొఖారా ప్రాంతంలోని ఓ హెూటల్‌పై కూడా నిరసనకారులు దాడి చేశారు. దాంతో ఆ హెూటల్‌లో బస చేస్తున్న భారత పర్యాటకురాలు ఉపాసన గిల్ సాయం కోసం అర్థించారు. భారత ప్రభుత్వం తనకు సాయం చేయాలని ఓ వీడియోలో మొరపెట్టుకున్నారు. ఆ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. 'నా పేరు ఉపాసన గిల్. వాలీబాల్ లీగ్ కోసం నేపాల్‌కు వచ్చాను. నిరసనలతో పొఖారా ప్రాంతంలో ఉన్న హెూటల్‌లో చిక్కుకుపోయాను. తొలుత నేను బస చేసిన హెూటల్‌కు నిప్పంటించారు. నా వస్తువులన్నీ అందులోనే ఉండిపోయాయి. ద

2 లో..

# పాకిస్థాన్‌లో మోటార్‌సైకిళ్ల ఉత్పత్తిని నిలిపేసిన యమహా



ఎదుర్కొంటున్నాయి. ఈ క్రమంలోనే యమహా కూడా ఉత్పత్తిని ఆపివేయాలని నిర్ణయించింది. పాకిస్థాన్‌లో యమహా బ్రాండ్‌కు ఎంతో ఆదరణ, విశ్వసనీయత ఉన్నాయి. ఇలాంటి కీలక సమయంలో కంపెనీ తీసుకున్న ఈ నిర్ణయం స్థానిక ఆటోమొబైల్ మార్కెట్‌లో పెద్ద చర్చనీయాంశంగా మారింది.

అయితే, ఉత్పత్తిని నిలిపివేస్తున్నప్పటికీ తమ వినియోగదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసుకుంటామని యమహా భరోసా ఇచ్చింది. ఇప్పటికే బైకులు కొనుగోలు చేసిన వారికి ఆఫ్టర్ సేల్స్ సేవలు, వారంటీ సేవలు యథావిధిగా కొనసాగుతాయని స్పష్టం చేసింది. అంతేకాకుండా, అవసరమైన అన్ని స్పేర్ పార్టులను తమ అధీకృత డీలర్ల నెట్‌వర్క్ ద్వారా అందుబాటులో ఉంచుతామని హామీ ఇచ్చింది. దీంతో ప్రస్తుత యమహా వినియోగదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కంపెనీ ప్రతినిధులు తెలిపారు.

# ఎంత యూరియా కావాలో అంతే వాడండి

ఇప్పటికే రూ.1704 కోట్లు ఖర్చు చేసి.. 2.45 కోట్ల ఉచిత సిలిండర్లు మహిళలకు ఇచ్చామన్నారు. ప్రతీ ఇంటా వెలుగులు నింపాం కాబట్టే.. 'దీపం 2' సూపర్ హిట్ అయ్యిందన్నారు. ఈ సభ రాజకీయాల కోసం కాదు. ఓట్ల కోసం కాదు. ఇప్పుడు ఎన్నికలు కూడా లేవు. బాధ్యత గల ప్రభుత్వంగా కూటమి ఇచ్చిన మాటను నెరవేర్చిందని చెప్పడానికే ఇక్కడకు వచ్చామన్నారు. సూపర్ సిక్స్ హామీలను సూపర్ హిట్ చేశామని చెప్పేందుకు వచ్చాం. మీ ఆశీర్వాదం కోసం వచ్చామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు.

పేదవాడి ఆకలి తీర్చాలనే లక్ష్యంతో రాష్ట్రవ్యాప్తంగా అన్నా క్యాంటీన్లు పెట్టామని సీఎం చంద్రబాబు అన్నారు. వీటి ద్వారా ఇప్పటివరకు 5.60 కోట్ల భోజనాలతో కడుపు నింపామని, ఇంతకంటే ఆనందం ఏముంది.? అని తెలిపారు. గత ప్రభుత్వం పేదల పొట్టకొట్టి.. అన్న క్యాంటీన్లను మూసేసింది. ఆటో మిత్ర



కింద ఆటో డ్రైవర్లకు రూ. 15 వేలు ఆర్థిక సాయం చేస్తాం. ఎన్నికల్లో చెప్పాం.. ఎన్ని కష్టాలున్నా చేస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. ఇదీ పేదలపై కూటమి ప్రభుత్వానికి ఉన్న ప్రేమ అని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు.

కూటమి ప్రభుత్వం అందరి ప్రభుత్వమన్న చంద్రబాబు అన్ని వర్గాల ప్రభుత్వమని, అందరి జీవితాలు మార్చే ప్రభుత్వమన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పేదల జీవితాలను మార్చేలా సంస్కరణలు తెస్తున్నాయన్నారు. సంస్కరణలతో పన్నులు తగ్గి నిత్యావసరాలు అందుబాటులోకి వస్తాయి. ఎన్డీయే ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం కోట్ల మంది పేదల కొనుగోలు శక్తి పెంచుతుంది. ఇదే స్ఫూర్తితో యూనివర్సల్ హెల్త్ స్కీం తెచ్చామని, దీంతో పేదల వైద్య ఖర్చులు తగ్గుతాయన్నారు. బీసీలను ఆదుకునేందుకు నేతన్నలకు విద్యుత్ రాయితీలు, మత్స్యకారులకు ఆర్థిక సాయం, మద్యం షాపుల్లో 10 శాతం కేటాయింపులు, నాయీ బ్రాహ్మణులకు జీతాలు పెంపు, సెలూన్ లకు ఉచిత విద్యుత్, సోలార్ రూఫ్ టాప్ లో ప్రత్యేక సబ్సిడీ ఇస్తున్నామన్నారు. అర్చకులు, ఇమామ్, మౌజన్లు, పాస్టర్లకు గౌరవ వేతనం పెంచామని, ఎస్సీ ప్రజల చిరకాల ఆకాంక్ష అయిన వర్గీకరణను ఎవరికీ నష్టం లేకుండా పూర్తి చేశాం. ఎస్టీల జీవన ప్రమాణాలు పెంచుతున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు.

# రాష్ట్రంలో అసలు ప్రభుత్వం ఉందా..?

ప్రజల గొంతు నొక్కుతున్నారు. అభివృద్ధి, సంక్షేమం రెండూ లేవు. ఏపీ ఆర్థిక వ్యవస్థ తిరోగమనంలో ఉంది. ప్రజలకు అందాల్సిన విద్య, వైద్యం, వ్యవసాయం.. ప్రైవేట్ వ్యక్తుల దోపిడీకి గురవుతున్నాయి. కూటమి పాలన ప్రజల కోసమా.. లేక దోపిడీదారుల కోసమా..?' అని జగన్ ప్రశ్నించారు. 'ఎరువులు బ్లాక్ మార్కెట్‌కు తరలివెళ్తున్నాయి. రైతుల కోసం పోరాడితే అర్ధరాత్రి నోటీసులు ఇచ్చారు. రైతుల కోసం పోరాటం చేయడం తప్పా..? రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారు. మీరు ఎరువుల స్కామ్ చేయకపోతే ఈ పరిస్థితి వచ్చేదా..? రెండు నెలలుగా రైతులు అవస్థలు పడుతున్నారు. అయినా ప్రభుత్వం పట్టనట్టుగా ఉంటోంది. ఇంత అధ్వానమైన ప్రభుత్వాన్ని ఎప్పుడూ చూడలేదు. సీఎం సొంత నియోజకవర్గం కుప్పంలోనూ రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారు. మా ప్రభుత్వ హయాంలో ఎన్నడూ రైతులు రోడ్డెక్కలేదు. అప్పుడు లేని రైతు కష్టాలు ఇప్పుడు ఎందుకు వచ్చాయి. రైతులు రోడ్డెక్కే పరిస్థితి ఎందుకొచ్చింది..? మీరు ఎరువుల్ని అందించి ఉంటే, ఈ పరిస్థితి ఉండేదే కాదు. మేం రైతులకు మంచి చేయాలనుకున్నాం. అందుకే రాష్ట్రంలో యూరియా కొరత లేకుండా చూశాం. ఆర్బీకేలను గాలికొదిలేశారు. ఈ క్రాప్, పీఏసీలను నిర్వీర్యం చేశారు. పంట నష్టానికి ఇన్‌పుట్ సబ్సిడీ రావడం లేదు. రైతులకు సున్నా వడ్డీ పథకం ఆపేశారు. ఎరువులను టీడీపీ నేతలే పక్కదారి పట్టించారు. ఎరువుల కొరత సృష్టించి బ్లాక్‌లో అమ్ముకుంటున్నారు. బ్లాక్ మార్కెటింగ్‌పై ప్రభుత్వ చర్యలు లేవు' అని జగన్ అన్నారు.



# భారత్-నేపాల్ సరిహద్దులో ఉద్రిక్తత..



చేసింది. నేపాల్‌లో అశాంతి పెరిగిపోవడంతో ఆ ప్రభావం మన దేశంపై పడకుండా కేంద్ర ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టింది. సుమారు 1,751 కిలోమీటర్ల పొడవైన భారత్-నేపాల్ సరిహద్దు వెంబడి హై అలర్ట్ ప్రకటించింది. సరిహద్దు భద్రతా దళమైన సశస్త్ర సీమా బల్ (ఎస్ఎస్‌బీ)తో పాటు ఉత్తరాఖండ్, ఉత్తర ప్రదేశ్, బీహార్, పశ్చిమ బెంగాల్, సిక్కిం రాష్ట్రాల పోలీసులు గస్తీని ముమ్మరం చేశారు. "నేపాల్‌లో పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని సరిహద్దులో అప్రమత్తత ప్రకటించాం. ఎస్ఎస్‌బీ బృందాలు పరిస్థితిని నిశితంగా గమనిస్తున్నాయి" అని ఓ ఉన్నతాధికారి తెలిపారు. భద్రతా చర్యల్లో భాగంగా సరిహద్దుల్లో రాకపోకలపై కఠిన ఆంక్షలు విధించారు. ఉత్తర ప్రదేశ్‌లోని గౌరీఫాంటా సరిహద్దు వద్ద నేపాల్ పౌరులను భారత్‌లోకి అనుమతించడం లేదు. అదేవిధంగా, నేపాల్ కూడా భారత పౌరులను తమ దేశంలోకి రానివ్వడం లేదు. అయితే, తమ తమ దేశాలకు తిరిగి వెళ్లే పౌరులకు మాత్రం మినహాయింపు ఇస్తున్నారు. ఈ ఆంక్షల వల్ల పశ్చిమ బెంగాల్‌లోని పానీటంకీ వంటి ప్రాంతాల్లో వందలాది సరుకు రవాణా ట్రక్కులు నిలిచిపోయి వాణిజ్యం స్తంభించింది. ఈ నేపథ్యంలో భారత విదేశాంగ శాఖ మంగళవారం ఒక కీలక ప్రకటన విడుదల చేసింది. నేపాల్‌లో ఉన్న భారత పౌరులు అత్యంత జాగ్రత్తగా ఉండాలని, అత్యవసరం కాని ప్రయాణాలను వాయిదా వేసుకోవాలని సూచించింది. ఇరు దేశాల మధ్య విమాన సర్వీసులను కూడా తాత్కాలికంగా నిలిపివేశారు.

# డిప్యూటీ సీఎం ఫొటో పెట్టొద్దని ఎక్కడ ఉంది

మన గళం, అమరావతి : ప్రభుత్వ కార్యాలయాల్లో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఫొటో ఏర్పాటు చేయడాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిల్‌ను ఏపీ హైకోర్టు కొట్టివేసింది. డిప్యూటీ సీఎం ఫొటో ఏర్పాటుపై నిషేధం ఎక్కడ ఉందని విచారణ సందర్భంగా ధర్మాసనం ప్రశ్నించింది. రాజకీయ దృష్టితో ఉద్దేశపూర్వకంగానే ఈ ప్రజాప్రయోజన వ్యాజ్యాన్ని దాఖలు చేశారని అభిప్రాయపడింది. ఈ మేరకు పిల్‌ను డిస్మిస్ చేసింది. చట్టబద్ధమైన అనుమతులు లేకుండా డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఫొటోను ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రదర్శిస్తున్నారంటూ రైల్వే విశ్రాంత ఉద్యోగి వై.కొండలరావు ఈ పిటిషన్‌ను దాకలు చేశారు. చిత్రపటాల ప్రదర్శన విషయంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్దిష్ట విధానం తీసుకొచ్చే వరకు కార్యాలయాల్లో పవన్ కళ్యాణ్ ఫొటో తొలగించేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. సాధారణ పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శి, సహాయ కార్యదర్శి, సమాచార పౌరసంబంధాల శాఖ డైరెక్టర్‌తో పాటు వ్యక్తిగత హోదాలో పవన్ కళ్యాణ్‌ను ప్రతివాదులుగా చేర్చారు. ఈ వ్యాజ్యంపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం ఇవాళ విచారణ జరిపింది. ప్రజాహిత ప్రయోజనాల కోసం చట్టబద్ధంగా కోర్టును ఆశ్రయించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరికి ఉందని హైకోర్టు స్పష్టం చేసింది. సమాజానికి మేలుచేసే విధంగా, నిజమైన ప్రజా ప్రయోజనాలపై




దృష్టి సారించిన వ్యాజ్యాలను మాత్రమే న్యాయస్థానం పరిగణనలోకి తీసుకుంటుందని తెలిపింది. రాజకీయ లక్ష్యాలతో కోర్టులను వేదికగా మార్చే ప్రయత్నాలు మంచివి కాదని హెచ్చరించింది.

## ఎటుచూసినా మంటలే.. సాయం చేయండి

దాడి సమయంలో నేను స్పాలో ఉన్నాను. కొందరు నిరసనకారులు పెద్దపెద్ద కర్రలతో నా వెంటపడ్డారు. ప్రస్తుతం పరిస్థితులు ఏమాత్రం బాగా లేవు. రోడ్డుపై ఎక్కడ చూసినా మంటలే కనిపిస్తున్నాయి. వారు పర్యాటకులను కూడా వదలడం లేదు. ఎలాంటి ఆలోచన లేకుండా ప్రతిదీ తగలబెడుతున్నారు. పరిస్థితి ఎలా ఉంటుందో తెలియడం లేదు. నాతోపాటు చాలామంది సాయం కోసం ఎదురుచూస్తున్నారు' అని గిల్ ఆ వీడియోలో ఆవేదనచెందారు. ఇప్పటికే నేపాల్‌లో ఉన్న భారతీయులను స్వదేశానికి రప్పించేందుకు భారత ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. అక్కడి రాయబార కార్యాలయం హెల్ప్‌లైన్ నంబర్లను వెల్లడించింది. అలాగే పరిస్థితులు చక్కబడేవరకు ప్రయాణాలు వాయిదా వేసుకోవాలని సూచించింది. ప్రస్తుతం ఉన్నచోటే ఉండాలని, వీధుల్లోకి రావొద్దని హెచ్చరించింది. ఎప్పటికప్పుడు స్థానిక యంత్రాంగం ఇచ్చే సూచనలను పరిగణనలోకి తీసుకోవాలని కోరింది. కాగా నేపాల్ సరిహద్దుల్లో ఉన్న ఉత్తర్‌ప్రదేశ్‌లోని సొనౌలీ ప్రాంతం మీదుగా భారతీయ పర్యాటకులు తిరిగి స్వదేశానికి వస్తున్నారు.

# 'సూపర్ సిక్స్' సూపర్ హిట్ అనడం సిగ్గుచేటు

- **సూపర్ సిక్స్ పథకాలపై కూటమి ప్రభుత్వానిది కొండంత ప్రచారం అని షర్మిల విమర్శ**
- **నిరుద్యోగ భృతి, 20 లక్షల ఉద్యోగాల హామీ ఏమైందని సూటి ప్రశ్న**
- **తల్లికి వందనం పథకంలోనూ లక్షలాది మందికి అన్యాయం జరిగిందని వ్యాఖ్య**
- **ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల**

మన గళం, అమరావతి : ఆంధ్రప్రదేశ్ లోని కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న 'సూపర్ సిక్స్' పథకాలపై ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల విమర్శలు గుప్పించారు. ఇచ్చిన హామీలలో ఒక్కటి కూడా పూర్తిగా అమలు చేయకుండానే 'సూపర్ హిట్' అని ప్రచారం చేసుకోవడం సిగ్గుచేటని, ప్రజలను నవ్వించే చర్య అని ఆమె ఘాటుగా విమర్శించారు. విజయవాడలో ఆమె మాట్లాడుతూ, ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవడంలో విఫలమైందని ఆరోపించారు. రాష్ట్రంలోని 50 లక్షల మంది నిరుద్యోగుల్లో కనీసం ఒక్కరికైనా రూ. 3,000 భృతి అందిందా? అని ఆమె ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించారు. అధికారంలోకి వస్తే 20



లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పిన హామీ ఏమైందని నిలదీశారు. పరిశ్రమలు స్థాపించకుండానే ఒప్పందాలు చూపి ఉద్యోగాలు సృష్టించామని చెప్పడం హాస్యాస్పదంగా ఉందని ఎద్దేవా చేశారు. నిరుద్యోగ భృతి, ఉద్యోగాలు ఇవ్వకుండానే సూపర్ సిక్స్ విజయవంతమైందని ఎలా చెబుతారని ఆమె ప్రశ్నించారు. ఇతర కీలక హామీల అమలు తీరును కూడా షర్మిల తప్పుబట్టారు. "ప్రతి నెలా మహిళలకు రూ. 1,500 ఇస్తామన్న హామీని గాలికొదిలేశారు. రైతుల విషయంలోనూ ప్రభుత్వం మోసపూరితంగా వ్యవహరిస్తోంది. కేంద్రం ఇచ్చే రూ. 6,000కు అదనంగా ఇస్తామని చెప్పి, ఇప్పుడు కేవలం 44 లక్షల మంది రైతులకే రూ. 7,000 అందిస్తూ, దాదాపు 30 లక్షల మందికి కోత పెట్టారు" అని విమర్శించారు. అలాగే, 'తల్లికి వందనం' పథకంలో కూడా 87 లక్షల మంది విద్యార్థులకు గాను 20 లక్షల మందికి లబ్ధిని దూరం చేశారని ఆమె పేర్కొన్నారు. ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు ఇస్తామన్న హామీపైనా స్పష్టత కొరవడిందని అన్నారు.

ఇవే కాకుండా, ఏటా జాబ్ క్యాలెండర్, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు 50 ఏళ్లకే పింఛను, వ్యవసాయ సబ్సిడీలు, ఫీజు రీయింబర్స్‌మెంట్, ఆరోగ్యశ్రీ చెల్లింపులు, పెట్రోల్-డీజిల్ ధరల తగ్గింపు వంటి కీలక హామీల ఊసే లేదని షర్మిల గుర్తు చేశారు. గోరంత చేసి కొండంత ప్రచారం చేసుకోవడం కూటమి ప్రభుత్వానికే చెల్లిందని విమర్శించారు.

## నేపాల్ బాధితులను క్షేమంగా రాష్ట్రానికి తీసుకొస్తాం

గుర్తించారు. వీరిని వీలైనంత త్వరగా సురక్షితంగా రాష్ట్రానికి తీసుకువచ్చేందుకు ప్రభుత్వం చర్యలు ముమ్మరం చేసింది. మంగళగిరికి చెందిన మాచర్ల హేమసుందర్ రావు, దామర్ల నాగలక్ష్మి తదితర 8 మంది యాత్రికులు ప్రస్తుతం ఖాట్మండు ఎయిర్‌పోర్టుకు కిలోమీటరు దూరంలో ఉన్న పశుపతి ఫ్రంట్ హోటల్‌లో తలదాచుకుంటున్నారు. మంత్రి లోకేశ్‌తో వీడియో కాల్ లో మాట్లాడిన వారు తమ ఆవేదనను వ్యక్తపరిచారు. నిన్న తాము ప్రయాణిస్తున్న బస్సుపై ఆందోళనకారులు దాడి చేశారని, తీవ్ర భయాందోళనకు గురయ్యామని తెలిపారు. తమతో పాటు మరో 40 మంది తెలుగువారు కూడా అదే హోటల్‌లో ఉన్నట్లు వారు వివరించారు. దీనిపై స్పందించిన మంత్రి లోకేశ్, ఎవరూ ఆందోళన చెందవద్దని, అందరినీ క్షేమంగా రాష్ట్రానికి తీసుకువచ్చే బాధ్యత తమదని భరోసా ఇచ్చారు. బాధితులతో నిరంతరం టచ్‌లో ఉండి, వారికి అవసరమైన సహాయాన్ని సమన్వయం చేసేందుకు రాష్ట్ర వైద్య మౌలిక సదుపాయాల సంస్థ ఛైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావును నియమించినట్లు తెలిపారు. ఈ విషయంపై మంత్రి లోకేశ్ వెంటనే ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు.

గురువారం
11 - 09 - 2025

మా కలం.. మీ గళం..
మన గళం
దిన పత్రిక

## ఘనంగా..జన్మదిన వేడుకలు






(మన గళం,కర్నూలు వి.ఆర్.కాలనీ) : నగరంలోని స్థానిక రామలింగేశ్వర్ నగర్ కాలనీలో న్యాయవాది ఓ.మహేష్ బాబు జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. బుధవారం ఆయన అభిమానులు జన్మదిన సందర్భంగా కేకులు కోసి, సంబరాలు జరుపుకున్నారు. కేవలం న్యాయవాదిగనే కాకుండా డోనేట్ పీపుల్ ఛారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఆయన పెద్ద ఎత్తున తరచుగా సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న విషయం పాఠకులకు విదితమే. అన్నదానాలు,అవసరార్థులకు ఆర్థిక సాయం చేయడం,వైద్య సేవలందేలా చూడడంతో పాటు, ప్రతి ఏటా వినాయక చవితి పర్వదిన సందర్భంగా కాలనీలో వినాయక విగ్రహాన్ని డొనేట్ చేయడం లాంటి సేవా కార్యక్రమాలు ఆయన చేస్తుంటారు. అదే రీతిలో ఆయన జన్మదిన సందర్భంగా ఆ కాలనీలో అన్నదాన కార్యక్రమం జరిగింది.

## వినియోగదారుల సౌకర్యార్థం పోస్ట్ బాక్స్



మనగళం, కర్నూలు సిటీ : వినియోగదారుల సౌకర్యార్థం ప్రెస్ క్లబ్ కార్యాలయం వద్ద పోస్ట్ బాక్స్ ఏర్పాటు చేయడం జరిగిందని కర్నూల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు కొత్తూరు సత్యనారాయణ గుప్తా తెలిపారు. బుధవారం మధ్యాహ్నం పోస్ట్ బాక్స్ లో ఉత్తరాలను వేస్తూ ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థ పోస్టల్ శాఖ సేవలను ప్రతి వినియోగదారుడు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. సాంకేతిక పరంగా ఎన్ని సౌకర్యాలు కలిగి ఉన్న పోస్ట్ బాక్స్ యొక్క వినియోగం కూడా ఎంత అవసరమన్నారు. పోస్ట్మాన్ ఒక కుటుంబ సభ్యుడు అని, ఆయన ఉత్తరం తీసుకుని వచ్చి పోస్ట్ అనగానే ఇంట్లో ఉన్న కుటుంబ సభ్యులందరూ ఒక్కసారిగా గేటు వద్దకు వచ్చి ఉత్తరాలు ఇంకా ఇతరత్రా తీసుకొని మంచివైతే సంతోషపడతారు, చెడు వార్తలు తీసుకుని వచ్చిన అవునా అంటూ అనుకునే పరిస్థితి ఉంటుందన్నారు. భారతదేశంలో మారుమూల గ్రామాలకు కూడా పోస్టల్ శాఖ సేవలు అందిస్తున్నారని ఆయన తెలిపారు. వినియోగదారులు పోస్ట్ కార్డులు, పోస్ట్ కవర్లను, పోస్టల్ స్టాంపులను సద్వినియోగం చేసుకోవాలని అని తెలిపారు. అడిగిన వెంటనే ప్రెస్ క్లబ్ కార్యాలయం వద్ద పోస్ట్ బాక్స్ ఏర్పాటు చేయించిన పోస్టల్ శాఖ సూపరింటెండెంట్ కు ఈ సందర్భంగా సత్యనారాయణ గుప్త కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ కమిటీ సభ్యులు పెద్దయ్య, కరణ్, ఫోటోగ్రాఫర్ రాము, మస్తాన్వలి, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## నారా చంద్రబాబునాయుడు, నారా భువనేశ్వరమ్మకు శుభాకాంక్షలు



మనగళం, కర్నూలు సిటీ : తెలుగుదేశం పార్టీ అధినేత, సీఎం నారా చంద్రబాబు నాయుడు నారా భువనేశ్వరమ్మ దంపతులకు వివాహ వార్షికోత్సవం సందర్భంగా జిల్లా తెలుగుదేశం పార్టీ బీసీ సెల్ అధ్యక్షులు సత్రం రామకృష్ణుడు ఆధ్వర్యంలో బుధవారం ఆ పార్టీ కర్నూలు జిల్లా కార్యాలయంలో కేక్ కట్ చేశారు. సీఎం నారా చంద్రబాబు దంపతులకు నాయకులు, కార్యకర్తలు శుభాకాక్షలు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర టీఎన్ఎస్ఎఫ్ అధికార ప్రతినిధి రెడ్డి, బాబు, బజార్, మంత్రాలయం బీసీ సెల్ అధ్యక్షులు అమర్నాథ్ రెడ్డి, పార్లమెంట్ బీసీ సెల్ అధికార ప్రతినిధి వాల్మీకి నరసింహనాయుడు, టీడీపీ జిల్లా కార్యదర్శి బేతం కృష్ణుడు, నాయకులు చలపతి, వడ్డే శంకర్, నవీన్, బాబురావు, శేషిరెడ్డి మొదలగు వారు పాల్గొన్నారు.

## కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి



మనగళం, కర్నూలు సిటీ : కర్నూల్ నగరంలోని గణేష్ నగర్ లో భవన నిర్మాణ కార్మికుల సమావేశం జరిగింది. సమావేశానికి సీఐటీయూ నగర నాయకులు బి శ్రీనివాసులు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆర్ నరసింహులు, సీఐటీయూ నగర నాయకులు బి రాధాకృష్ణ కార్మికులను ఉద్దేశించి మాట్లాడారు. భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డును పునర్ ప్రారంభించాలని కోరుతూ ఈనెల 15వ తేదీన విజయవాడలో లేబర్ కమిషనర్ ఆఫీసు ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. గతంలో వైసీపీ ప్రభుత్వం భవనిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును నిలుపుదల చేసిందని, తాము అధికారంలోకి వస్తే మళ్లీ ప్రారంభిస్తామని హామీ ఇచ్చిన కూటమి పెద్దలు గద్దెనెక్కాక పట్టించుకోకపోవడం విచారకరమని ఆందోళన వ్యక్తం చేశారు. సంక్షేమ బోర్డులో రూ. 4298 కోట్ల కాంట్రాక్టర్ ద్వారా వసూలు చేసిన సెస్సు నిధులు ఉన్నాయని, ఈ నిధులను కార్మికుల సంక్షేమం కోసం ఖర్చు పెట్టాలని డిమాండ్ చేశారు.

### 15న విజయవాడకు తరలిరావాలి

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ చట్టాన్ని పునరుద్ధరించాలని కోరుతూ ఈనెల 15వ తేదీన చేపట్టిన ఛలో విజయవాడ కార్యక్రమానికి కార్మికులు తరలిరావాలని భవన నిర్మాణ కార్మిక సంఘం నగర ఉపాధ్యక్షుడు కె సుధాకరప్ప, సీఐటీయూ నగర ఉపాధ్యక్షులు యేసు పిలుపునిచ్చారు. బుధవారం షరీన్ నగర్ మట్టి పని మేస్త్రీల సమావేశం కల్లూరు సూర్యనారాయణ భవన్లో ఎం దాసు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి పెద్దలు ఎన్నికలలో భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ చట్టాన్ని పునరుద్ధరిస్తామని, సంక్షేమ పథకాలు అమలు చేస్తామని హామీ ఇచ్చి విస్మరించారన్నారు. కార్మికులకు హక్కుగా వచ్చిన సంక్షేమ చట్టం రద్దు చేయడానికి ఎవరికి ఏ హక్కు లేదని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మట్టి పని మేస్త్రీలు శ్రీనివాసులు, వేణు, రామాంజనేయులు, జీ వెంకటేశ్వర్లు, మరియమ్మ, రమాదేవి, శేషమ్మ, కమలమ్మ, లక్ష్మీదేవి, మరియమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## మొండి బకాయిదారులపై ఉదాసీనతను సహించం

- ఆస్తి పన్ను, తాగునీటి కుళాయి చార్జీల బకాయిలను రాబట్టాలి
- నగరపాలక సంస్థ కమిషనర్ పి. విశ్వనాథ్ ఆదేశం



మనగళం, కర్నూలు సిటీ : నగరంలో ఆస్తి పన్ను, తాగునీటి కుళాయి చార్జీలకు సంబంధించి ఉన్న మొండి బకాయిల వసూళ్ల విషయంలో ఎలాంటి ఉదాసీనతను సహించబోమని నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్ స్పష్టం చేశారు. బుధవారం స్థానిక ఎస్బీఐ ఎంప్లాయీస్ కాలనీలోని నగరపాలక సమావేశ భవనంలో పన్ను వసూళ్లపై రెవెన్యూ, ఇంజనీరింగ్, నోడల్ అధికారులు, అడ్మిన్, అమినిటీస్ కార్యదర్శులతో కమిషనర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరపాలక సంస్థకు ఆస్తి పన్ను బకాయిలు దాదాపు రూ.93 కోట్లు ఉన్నాయని, అందులో టాప్-100 బకాయిదారుల నుండి రూ.12.76 కోట్లు వసూలు చేయాల్సి ఉందని తెలిపారు. తాగునీటి కుళాయి చార్జీల బకాయిలు మొత్తం రూ.21 కోట్లు ఉండగా, టాప్-100 బకాయిదారులే రూ.7 కోట్లు చెల్లించాల్సి ఉందన్నారు. నోడల్ అధికారుల నేతృత్వంలో డీఈఈ, ఏఈ, అడ్మిన్, అమినిటీస్ కార్యదర్శులు సమన్వయంతో, వారివారీ పరిధిలో టాప్-100 మొండి బకాయిదారులపై ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవాలని కమిషనర్ ఆదేశించారు. నగర వ్యాప్తంగా టాప్-100 బకాయిల వసూళ్లకు మూడు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా గత ఆర్థిక సంవత్సరంలో తాగునీటి కుళాయి చార్జీలను 95% వసూలు చేసిన కార్యదర్శిని కమిషనర్ అభినందించారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ సతీష్ కుమార్ రెడ్డి, ప్రజారోగ్య అధికారి డాక్టర్ విశ్వేశ్వర్ రెడ్డి, ఆర్ఓలు జునైద్, వాజీద్, స్వర్ణలత, ఎస్ఈ శేషసాయి, ఎంఈ మనోహర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడి వర్కర్ల హెల్పర్ల మినీ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి.







ఫుడ్ కమిషన్ సభ్యురాలు గంజిమల దేవి గారికి ఏపీ అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి .లలిత, జిల్లా కౌన్సిల్ సభ్యురాలు షమీనాభాను లు పిడి విజయ మేడంగారు, ఈవో రాజేశ్వరి మేడం గారు, సిడిపిఓ లూక్ గారు, సూపర్వైజర్ పద్మ మేడం గారు వీరందరూ కలిసి, శాలువా పూలమాలతో సత్కరించడమైనది. లలిత ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా, రేషన్ షాప్ లో ప్రాబ్లమ్స్, మెనూ ప్రాబ్లమ్స్, కాంట్రాక్టర్ల ట్రాన్స్పోర్ట్ ల, ప్రాబ్లమ్స్, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వేతనాల పెంపుదల గురించి, ప్రధానమంత్రి మాతృ వందన యోజన పథకం గురించి, సంక్షేమ పథకాలు వర్తింప చేయాలని, అంగన్వాడి కేంద్రాలకు వంట పాత్రలు ఉచిత గ్యాస్ ఇవ్వాలని వీటన్నింటినీ గారితో మామినిస్టర్ గారితో, మాట్లాడి మా సమస్యలు పరిష్కరించి, వేతనాలు పెంపుదల, ఈత సమస్యలన్నీ పరిష్కారం కోసం, తమరు కృషి చేయాలని, మేడం గారికి విజ్ఞప్తి చేయడం జరిగింది, మేడం గారు మాకు సమావేశాలు ఏర్పాటు చేసినప్పుడు, తప్పకుండా ప్రభుత్వం దృష్టికి ,మినిస్టరు గార్ల దృష్టికి కంపల్సరీ తీసుకొని వెళ్తానని మేడం గారు తెలియజేశారు. మా అసోసియేషన్ నుండి మేడం గారికి అభినందనలు తెలియజేశాము.

## దిగువపాడు గ్రామంలో వైస్సార్సీపీ నాయకులు వంగూరు సుదర్శన్ రెడ్డి మృతి నివాళులర్పించిన వైఎస్ఆర్సిపి పార్టీ శ్రేణులు

మన గళం కర్నూలు: కర్నూలు మండలం లో దిగువపాడు గ్రామంలో వైస్సార్సీపీ నాయకులు వంగూరు సుదర్శన్ రెడ్డి మృతికి మాజీ కుడా చైర్మన్ కోడుమూరు నియోజకవర్గ సమన్వయకర్త కోట్ల హర్షర్ధన్ రెడ్డి కోడుమూరు నియోజకవర్గ వైఎస్ఆర్సిపి ఇంచార్జి డాక్టర్ ఆదిమూలపు సతీష్ పరామర్శించి ఘన నివాళులు అర్పించారు కోడుమూరు నియోజకవర్గం లోని కర్నూలు మండలంలోని దిగువపాడు గ్రామ పంచాయతీలో సుదర్శన్ రెడ్డి అనారోగ్యంతో మృతి చెందిన వార్త పార్టీ శ్రేణుల్లో తీవ్ర విషాదాన్ని కలిగించింది. వారి మృతిపై విచారం వ్యక్తం చేస్తూ పరామర్శ తెలిపారు కోట్ల హర్షవర్ధన్ రెడ్డి డాక్టర్ ఆదిమూలపు సతీష్ వారి ఇంటికి వెళ్లి చనిపోయిన సుదర్శన్ రెడ్డి పార్థివదేహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శిస్తూ ధైర్యం చెప్పి, వారి బాధను పంచుకున్నారు ఈ కార్యక్రమంలో కోడుమూరు నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షులు ఎం కె వెంకటేష్ మరియు గ్రామ నాయకులు చంద్రారెడ్డి, వెంకట్రామిరెడ్డి, వీరభద్రారెడ్డి, మాజీ ఎంపీటీసీ వినోద్ కుమార్ రెడ్డి, చంద్ర మోహన్ రెడ్డి, మండల కార్యదర్శి దస్తగిరి, బాషా మరియు కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



## గుర్తు తెలియని మృతదేహం



మనగళం, కర్నూలు సిటీ : కర్నూల్ ప్రభుత్వ ఆసుపత్రి కాంపౌండ్ గోడకు ఆనుకొని ఉన్న యూనియన్ బ్యాంక్ ఏటీఎం సెంటర్ పక్కన గుర్తు తెలియని మృతదేహాన్ని గుర్తించామని పోలీసులు తెలిపారు. అతని వయసు సుమారు 50 నుండి 55 సం.ల మధ్య ఉంటుందన్నారు. అతను ఛామనఛాయ వర్ణంలో ఉండి మాసిన గడ్డంతో ఉన్నాడు. అతని శరీరంపైన ముదురు నీలము రంగు (టీ షర్ట్) ముదురు నీలము రంగు గల నిక్కర ధరించి ఉన్నాడన్నారు. ఇతని ఆచూకి తెలిసిన వ్యక్తులు కర్నూల్ 3 టౌన్ పోలీసు స్టేషన్ సీఐ నెం: 9121101061, ల్యాండ్ నెం 08518-277187 సమాచారం ఇవ్వాలని పోలీసులు తెలిపారు.

## జనసేన కుటుంబానికి రూ.5 లక్షలు ఆర్థిక సాయం



మనగళం, కర్నూలు సిటీ : కోడుమూరు నియోజకవర్గం కర్నూలు రూరల్ మండలం మమిందాలపాడు గ్రామంలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన జనసేన క్రియాశీలక సభ్యుడు మాల అనిల్ కుమార్ కుటుంబానికి రూ.5 లక్షల బీమా చెక్ అందజేశారు. జనసేన అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు ఆ పార్టీ కోడుమూరు నియోజకవర్గ సమన్వయకర్త ఆకెపోగు రాంబాబు మృతుడి కుటుంబ సభ్యులకు చెక్కును అందజేశారు. జనసేన పార్టీ కోసం పనిచేసే ప్రతి క్రియాశీలక సభ్యుడికి పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ అండగా ఉంటారనేందుకు ఇది ఒక నిదర్శనం అని ఈ సందర్భంగా ఆకెపోగు రాంబాబు పేర్కొన్నారు. జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వం తీసుకున్న ప్రతి ఒక్కరికి ప్రమాదవశాత్తు ఏదైనా జరిగితే వారికి పార్టీ అండగా ఉంటుందని ఆకెపోగు రాంబాబు తెలిపారు. కార్యక్రమంలో క్రియాశీలక వాలంటరీలు మౌలాలి, నాగరాజు, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

# యూరియాను సక్రమంగా పంపిణీ చేయాలి

**- జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా**



మనగళం, కర్నూలు సిటీ : రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా యూరియా సక్రమంగా పంపిణీ చేయాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా వ్యవసాయ అధికారులను ఆదేశించారు. బుధవారం దేవనకొండ మండలకేంద్రంలో మన గ్రోమోర్ యూరియా ఔట్లెట్ ను, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని, అంగన్వాడీ కేంద్రాన్ని, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మన గ్రోమోర్ యూరియా ఔట్లెట్ లో యూరియా సరఫరా, స్టాక్ లభ్యత, పంపిణీ విధానాలను కలెక్టర్ సమగ్రంగా పరిశీలించారు. రిజిస్టర్ లను పరిశీలిస్తూ, ఈ నెలలో ఎన్ని బస్తాల యూరియా సరఫరా చేశారని వివరాలను కలెక్టర్ షాప్ యజమానిని అడిగి తెలుసుకున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్ రోగులకు అందుబాటులో ఉండి మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్య అధికారులను ఆదేశించారు. క్యాజువాలిటీ లో వైరల్ ఫీవర్ తో అడ్మిట్ అయిన 7వ తరగతి విద్యార్థికి అందిస్తున్న వైద్య సేవల గురించి కలెక్టర్ వైద్య సిబ్బందిని ఆరా తీశారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలిస్తూ చాలా శుభ్రంగా మెయింటైన్ చేస్తున్నారని కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు. అంగన్వాడీ కేంద్రంలో మొత్తం ఎంతమంది పిల్లలు ఉన్నారు? ఈరోజు ఎంతమంది వచ్చారు?వారికి మెనూ ప్రకారమే భోజనం పెడుతున్నారా అని కలెక్టర్ అంగన్వాడి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి : జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించిన జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా పదో తరగతి పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని విద్యార్థులకు సూచించారు. క్రమశిక్షణతో చదువుకోవడం, ఉపాధ్యాయుల సూచనలు పాటించడం ద్వారా విజయాన్ని సాధించవచ్చని కలెక్టర్ పేర్కొన్నారు.

ఉల్లి రైతులతో మాట్లాడిన కలెక్టర్ : దేవనకొండ మండలం ఈదుల దేవరబండ గ్రామంలో ఉల్లి రైతులతో కలెక్టర్ మాట్లాడారు. ఉల్లి పంట సాగు, అమ్మకాల గురించి రైతులతో ఆరా తీశారు. ఉల్లి నాణ్యతను పరిశీలించారు. ఉల్లికి రాష్ట్ర ప్రభుత్వం రూ.1200 లు మద్దతు ధర అందిస్తోందని, రైతులు ఉల్లిని ఆరబెట్టి, గ్రేడింగ్ చేసుకొని మార్కెట్ యార్డుకు తీసుకు రావాలని కలెక్టర్ రైతులకు తెలియజేశారు. కార్యక్రమంలో పత్తికొండ ఆర్డీఓ భరత్ నాయక్, తహసీల్దార్ రామాంజనేయులు, దేవనకొండ మండలం వ్యవసాయ అధికారి ఉషా రాణి, తదితరులు పాల్గొన్నారు.

## అశ్లీలతను సెన్సార్ చేయాలి

మనగళం, కర్నూలు సిటీ : కార్మిక కర్షక భవన్ డీవైఎఫ్ఐ జిల్లా కార్యాలయం నందు పెద్దపాడు మహిళల జనరల్ బాడీ సమావేశాన్ని చిలకమ్మ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశాన్ని ఉద్దేశించి ఐద్వా రాష్ట్ర నాయకులు పీ నిర్మల మాట్లాడుతూ నేడు దేశంలో రాష్ట్రంలో మహిళలపై అత్యాచారాలు హత్యలు పెరిగిపోయాయని, వీటిని అరికట్టాలి అంటే కఠినమైన చట్టాల తో పాటు ఇంటర్నెట్లో లభ్యం అవుతున్న అశ్లీలతను పూర్తిగా సెన్సార్ చేయాలని డిమాండ్ చేశారు. మద్యాన్ని అరికట్టకుండా రోజురోజుకీ కూటమి ప్రభుత్వం కూడా ఏరులై పారిస్తుందని, వైన్ షాపులను విచ్చలవిడిగా ఓపెన్ చేసి తాగండి ఊగండి మహిళలపై దాడులు దౌర్జన్యాలు చేయండి అనేసి ప్రోత్సహిస్తుందని తెలిపారు. వెంటనే కేంద్రంలోని నరేంద్ర మోడీ సర్కారు మహిళలపై ఏమాత్రం ఇసుమంతా అభిమానం ఉన్న అశ్లీలతను సెన్సార్ చేయాలని కోరారు. సినిమాలు సీరియల్లలో మహిళలను కించపరిచేలాగా సన్నివేశాలు లేకుండా చూడాలని డిమాండ్ చేశారు. మహిళలందరూ ఐక్యంగా ఉద్యమించి మహిళల హక్కుల కోసం పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం పెదపాడు గ్రామం ఐద్వా నూతన కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్ష కార్యదర్శులుగా చిలకమ్మ, వరలక్ష్మి ఉపాధ్యక్షులుగా సంటెమ్మ, సావిత్రి, సహాయ కార్యదర్శి గా శాంతమ్మ, కమిటీ సభ్యులుగా ఎలిశమ్మ, షమీం, విజయమ్మ ను ఎన్నుకున్నారు.

## ఇమామ్, మౌజాంలకు గౌరవ వేతనాలు విడుదల చేయాలి

మనగళం, కర్నూలు సిటీ : రాష్ట్రంలోని ఇమామ్, మౌజాంలకు గౌరవ వేతనం మంజూరు చేయాలని జిల్లా కాంగ్రెస్ మైనార్టీ డిపార్ట్మెంట్ చైర్మన్ షేక్ ఖాజా హుస్సేన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఇమామ్, మౌజాంలకు 9 నెలల నుండి కూటమి ప్రభుత్వంలో గౌరవ వేతనాలు ఇవ్వడం లేదన్నారు. గత ప్రభుత్వంలో ప్రతినెల అకౌంటులో నగదు జమ అయ్యేవని చెప్పారు. అలాగే ఉర్దూ యూనివర్సిటీ భవనం శిథిలావస్థకు చేరిందని, గత టిడిపి ప్రభుత్వంలో చంద్రబాబు నాయుడు భవనానికి శంకుస్థాపన చేశారని, అది నిర్మాణం మధ్యలో ఆగిపోయిందన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు చొరవ తీసుకొని భవనాన్ని పూర్తి చేయించాలని ఖాజా హుస్సేన్ కోరారు.

## ఐఫోన్ 17 సిరీస్ విడుదల చేసిన యాపిల్

మనగళం, : ప్రపంచమంతా ఆసక్తిగా ఎదురుచూసే టెక్ దిగ్గజం యాపిల్ ఐఫోన్ కొత్త సిరీస్ లాంచ్ మంగళవారం జరిగింది. 'ఆ.. డ్రాపింగ్' పేరుతో యాపిల్ పార్క్‌లో ఈవెంట్ నిర్వహించింది. భారత కాలమానం ప్రకారం మంగళవారం రాత్రి 10.30 గంటలకు జరిగిన కార్యక్రమంలో యాపిల్ తన కొత్త ఉత్పత్తులను ఆవిష్కరించింది. ఐఫోన్ 17 సిరీస్‌లో భాగంగా కంపెనీ కొత్తగా ఐఫోన్ ఎయిర్ మోడల్‌ను తీసుకొచ్చింది. ఐఫోన్ 17, ఐఫోన్ 17 ప్రో, ఐఫోన్ 17 ప్రో మాక్స్, ఐఫోన్ ఐఫోన్ ఎయిర్ పేర్లతో వీటిని అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈసారి ప్లస్ మోడల్‌కు బదులుగా ఎయిర్‌ను తీసుకొచ్చింది. వీటితో పాటు యాపిల్ ఎయిర్‌పాడ్స్ ప్రో3, యాపిల్ వాచ్ అల్ట్రా 3, యాపిల్ వాచ్ సిరీస్ 11, యాపిల్ వాచ్ ఎస్ఈలను విడుదల చేసింది. ఏ19 చిప్‌సెట్ ద్వారా పనిచేసే కొత్త ఐఫోన్ ఐఓఎస్ 26తో, విజువల్ ఇంటెలిజెన్స్, లైవ్-ట్రాన్స్‌లేషన్ ఫీచర్స్ కలిగి ఉంది. ఈసారి ఈవెంట్‌లో యాపిల్ నుంచి ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న సూపర్ స్లిమ్ ఐఫోన్ 17 ఎయిర్‌ను 5.5ఎంఎం మందంతో విడుదల చేసింది. ఈ పరికరం ఏ19 ప్రో చిప్‌సెట్, 6.6-అంగుళాల సూపర్ రెటినా ఎక్స్‌డీఆర్ డిస్‌ప్లేతో వస్తుంది. ది ఎయిర్ కొత్త ఎన్1 చిప్ ద్వారా అప్‌గ్రేడ్ చేసిన వైఫై7, బ్లూటూత్6తో లభిస్తుంది. అంతేకాకుండా 48ఎంపీ డ్యూయల్-కెమెరా సిస్టమ్‌తో వచ్చే ఐఫోన్ ఎయిర్ రోజంతా బ్యాటరీ వాడేలా 40 గంటల వరకు వీడియో ప్లేబ్యాక్ చేయొచ్చని, ప్రత్యేకంగా ఈ ఫోన్‌లో ఈ-సిమ్ సౌకర్యం ఉంటుందని కంపెనీ వెల్లడించింది. కొత్త ఐఫోన్ 17 సిరీస్ కోసం సెప్టెంబర్ 12 నుంచి ప్రీ-బుకింగ్ ప్రారంభమవుతుంది. సెప్టెంబర్ 19 నుంచి డెలివరీలు అందిస్తామని కంపెనీ తెలిపింది.

# ఏ.పి.ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ నగరూరు రాఘవేంద్రను సత్కరించిన ఎద్దుల మహేశ్వర్ రెడ్డి



మన గళం కోడుమూరు: కర్నూలు జిల్లా కోడుమూరు పట్టణానికి చెందిన శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానం ధర్మ కర్త మరియు చైర్మన్ ఎద్దుల మహేశ్వర రెడ్డి మరియు ప్రముఖ సీనియర్ బి జె పి నాయకులు చంద్రమౌళి కలసి కర్నూల్ లో నగరూరు రాఘవేంద్రను తమ చాంబర్లో కలిసి అభినందనలు తెలియజేశారు అలాగే వారిని ఏ.పి.ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ గా నియమితులైన సందర్భంగా నగరూరు రాఘవేంద్రకు పుష్పగుచ్ఛాల నందజేసి, శాలువా కప్పి ఘనంగా సత్కరించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నగరూరు రాఘవేంద్ర ఒక సమర్థవంతమైన వ్యక్తి అని అటువంటి వ్యక్తికి ఈ పదవిని అందించినందుకు కూటమి ప్రభుత్వానికి వారు అభినందనలు తెలియజేశారు అలాగే నగరూర్ రాఘవేంద్ర ఉన్నత స్థాయి పదవులను పొందాలని వారు ఈ సందర్భంగా ఆకాంక్షించారు రాష్ట్రం నుంచి భాజపా తరపున డైరెక్టర్ గా నియమితులైన ఏకైక వ్యక్తి అని వారు ప్రశంసలు కురిపించారు ఈ సందర్భంగా నగరూరు రాఘవేంద్ర మాట్లాడుతూ తమకు పదవులు ముఖ్యం కాదని, పార్టీయే ముఖ్యమని నగరూరు రాఘవేంద్ర స్పష్టం చేశారు. భారతీయ జనతా పార్టీ కార్యకర్తలు నిబద్ధత కలిగిన వారని ఆయన పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో సీనియర్ బి జె పి నాయకులు చంద్రమౌళి మరియు శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానం ధర్మ కర్త మరియు చైర్మన్ ఎద్దుల మహేశ్వర రెడ్డి, వీరశైవ లింగాయతి సభ్యుడు దామోదర్, విశ్వబ్రాహ్మణ సంఘము వెంకటస్వామి,కాలికామాత దేవస్థానం ప్రతినిది గంగాధర్, కన్యక పరమేశ్వరి అమ్మ వారి ప్రతినిధి అర్వేటి కిశోర్,కుర్ని సంఘము ప్రతినిధి మధుసూదన్, శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానం ప్రతినిధి రంగ స్వామి పాల్గొన్నారు

# ప్రజల భద్రత, రక్షణే ధ్యేయంగా విజిబుల్ పోలీసింగ్

**- ముమ్మరంగా వాహనాలను తనిఖీ చేసిన పోలీసులు**





మనగళం, కర్నూలు క్రైం: జిల్లాలో ప్రజల భద్రత, రక్షణ, శాంతిభద్రతల పరిరక్షణ కోసం కర్నూలు పోలీసులు విజిబుల్ పోలీసింగ్ నిర్వహించారు. విజిబుల్ పోలీసింగ్ లో భాగంగా ప్రతి రోజు సాయంత్రం జిల్లా అంతట వాహనాల తనిఖీ లు చేపట్టారు. ప్రధానంగా రోడ్డు భద్రతా నిబంధనలపై వాహనచోదకులకు అవగాహన చేశారు. హెల్మెట్ / సీట్ బెల్టు ధరించాలని, డ్రంకన్ డ్రైవింగ్ లకు దూరంగా ఉండాలని సూచించారు. అదేవిధంగా రోడ్డు సేఫ్టీ ఉల్లంఘనలపై చర్యలు తీసుకున్నారు. విజిబుల్ పోలీసింగ్ లో వాహన చోదకులు ట్రిపుల్ రైడింగ్, వాహనానికి సరైన నెంబర్ ప్లేట్లు లేనివారిని, వాహన సంబంధిత రికార్డులు లేనివారిని, హెల్మెట్ లేకుండా మోటార్ సైకిల్ నడిపే వ్యక్తులను, సెల్ ఫోన్ డ్రైవింగ్, ర్యాష్ డ్రైవింగ్ చేసే వారిని గుర్తించి, రోడ్డు భద్రతా, మోటార్ వాహనాల చట్టం నియమ నిబంధనలు గురించి అవగాహన చేస్తున్నారు. గొడవలకు దూరంగా ఉండాలని, సైబర్ మోసాలు, మహిళలపై నేరాలు, బాల్యవివాహాలు, సీపీ కెమెరాల ఏర్పాటు ప్రాముఖ్యత పై ప్రజలకు పోలీసులు అవగాహన చేశారు. గంజాయి , మత్తు పదార్థాల వలన కలిగే అనార్థాల గురించి ప్రజలకు వివరించారు. అదేవిధంగా ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే అలాంటి వారిపై కఠిన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు.

# జీఎస్టీ సంస్కరణలు, ట్రంప్ టారిఫ్‌కు సంబంధం లేదు




మనగళం, : వస్తు, సేవల పన్ను(జీఎస్టీ) సంస్కరణలకు, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన అధిక సుంకాలకు ఎలాంటి సంబంధం లేదని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ స్పష్టం చేశారు.మంగళవారం జాతీయ మీడియా నిర్వహించిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆర్థిక మంత్రి.. ట్రంప్ టారిఫ్ ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకునే జీఎస్టీ రేట్ల తగ్గింపు నిర్ణయం వెలువడిందనే ఊహాగానాలను కొట్టిపారేశారు. ఆరోగ్య, జీవిత బీమాపై జీఎస్టీ మినహాయింపు మొదలుకొని జీఎస్టీ శ్లాబుల తగ్గింపు వరకు గడిచిన 18 నెలలుగా చర్చలో ఉన్నాయి. గతేడాది కేంద్ర బడ్జెట్‌కు ముందు నుంచే ఈ సంస్కరణల రూపకల్పన జరుగుతోంది. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సామాన్యులకు ఉపశమనం అందించాలని నాకు గుర్తు చేస్తూనే ఉన్నారని వివరించారు. అమెరికా ఎగుమతి అయ్యే 48 బిలియన్ డాలర్ల నష్టాన్ని భర్తీ చేసేందుకే జీఎస్టీ పన్ను తగ్గింపు నిర్ణయం తీసుకున్నారనే చర్చ జరుగుతోంది. ఆ రెండింటికి సంబంధం లేదు. సంస్కరణల ప్రతిపాదనల సిద్ధం చేసేందుకు సమయం పట్టింది. ఈ ఏడాది మే నెలలోనే ప్రధాని ఈ విషయంపై సంప్రదించానని చెప్పారు. సంస్కరణల గురించి అంతర్గతంగా చర్చించి, ఆపై జీఎస్టీ కౌన్సిల్ ముందుకు తీసుకెళ్లామని స్పష్టం చేశారు.

# సంపాదకీయం

హఠాత్తుగా జీఎస్‌టి సంస్కరణలు ఎందుకు?

ప్రధాని నరేంద్ర మోడీ చేసే వాగ్దానాల్లో, ప్రకటనల్లో ఎంతటి గాంభీర్యం ఉంటుందో ఆచరణలో మాత్రం అందుకు విరుద్ధమైన పరిస్థితి ఉంటుంది. ఇది బీజేపీ రాజకీయాలను గమనించిన ప్రతి ఒక్కరకి బాగా తెలుసు. తాజాగా కేంద్రంలోని మోడీ సర్కార్ జీఎస్టీలో మార్పులు తీసుకొచ్చి తమది సామన్యుడి, మధ్యతరగతి ప్రభుత్వమని చెప్పుకొనే ప్రయత్నం చేస్తోంది. దాదాపు పదకొండేళ్ల మోడీ పాలనలో జీఎస్టీ నిర్ణయాలతో పేద, సామాన్య, మధ్య తరగతి ప్రజలు నష్టపోయింది ఎంతో ప్రత్యేకించి చెప్పనక్కర్లేదు. ప్రజల కడుపు మాడ్చి ఎన్నికలకు ముందు బిర్యానీ ఫ్రీ అని ప్రకటించి పబ్బం గడుపుకోవడం కొన్ని రాజకీయ పార్టీల నైజం. ఈ విషయంలో బీజేపీ అన్ని పార్టీల కంటే పది ఆకులు ఎక్కువే చదివింది. ఈ కోవాలోనిదే తాజాగా చేసిన జీఎస్టీ శ్లాబు మార్పుల నిర్ణయం. పేదలపై, సామాన్య, మధ్య తరగతి ప్రజలపై కేంద్రంలోని మోడీ సర్కార్‌కు ఆమాంతంగా ప్రేమ కలగడానికి కారణాలు లేకపోలేదు. ఈ ఏడాది నవంబర్‌లో బీహార్ అసెంబ్లీ ఎన్నికలు ఉన్నాయి. వచ్చే ఏడాది చూస్తే తమిళనాడు, పశ్చిమ బెంగాల్ ఎన్నికలు ఉన్నాయి. ఇక 2027లో ఉత్తరప్రదేశ్, గుజరాత్ వంటి రాష్ట్రాల ఎన్నికలు ఉన్నాయి. వీటితో పాటు మరికొన్ని కీలక రాష్ట్రాలు ఉన్నాయి. వివిధ రాష్ట్రాల ఎన్నికలు ముందుంటే.. మరోవైపు ఇండియా కూటమి తరఫున ప్రారంభమైన ఓట్ చోర్.. గద్దీ చోడ్ ఉద్యమం బీజేపీకి పెనుసవాళ్లు విసురుతోంది. రాహుల్ గాంధీ నాయకత్వంలో కూటమి నేతలు చేస్తున్న ఈ ఉద్యమానికి ప్రజా మద్దతు అనూహ్యంగా వస్తోంది. దీంతో త్వరలో జరిగే వివిధ రాష్ట్రాల ఎన్నికలలో బీజేపీ విజయ అవకాశాలకు దారులు మూసుకుపోయే పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఈ తరుణంలో పేద, సామాన్య, మధ్య తరగతి వర్గాలకు ఊరాటనిచ్చే పేరుతో జీఎస్టీ శ్లాబులలో మార్పులకు కేంద్రంలోని మోడీ సర్కార్ నిర్ణయం తీసుకొంది. ఈ నిర్ణయంతో తాము సామాన్య, పేద ప్రజలకు ఎంతో మేలు చేశామని ప్రధాని నరేంద్ర మోడీ గాంభీర స్వరంలో చెప్పారు. కొత్త జీఎస్టీ శ్లాబ్‌లు ఈ సెప్టెంబర్ 22వ తేదీ నుంచి అమలులోనికి రానున్నాయి. అయితే స్వాతంత్ర్య వేడుకల్లో చెప్పినట్లుగా దేశ ప్రజలకు ప్రధాని నరేంద్ర మోదీ జీఎస్టీ శ్లాబ్‌లు మార్చి దసరా, దీపావళి గిఫ్ట్ ఇచ్చారా, ఇప్పటికీ అమలులోనున్న జీఎస్టీ విధానంతో ఇన్నాళ్లు దగా చేశారా అన్నది ఆలోచించాలి. ఇప్పటి వరకు అమలులోనున్న జీఎస్టీ విధానంతో ప్రజలు భారం మోశారు కాబట్టే ఇపుడు వచ్చే కొత్త విధానంతో పేద, సామాన్య, మధ్య తరగతికి ఊరాట ఇచ్చినట్లు చెప్పుకోవాల్సి వస్తోంది. ఇప్పుడు అమలులోనున్న జీఎస్టీ విధానం తీసుకొచ్చింది నరేంద్ర మోడీ సర్కార్ అన్న విషయం గమనంలోకి తీసుకోవాలి. ఇదిలావుంటే వస్తు సేవల పన్ను విధానంలో ప్రస్తుతం 0, 5, 12, 18, 28 శాతం శ్లాబులు ఉన్న సంగతి తెలిసిందే. కొత్తగా తీసుకొన్న నిర్ణయంతో ఇప్పుడున్న 12, 28 శాతం శ్లాబుల్ని ఎత్తివేసే యోచనలో ఉండగా ఇక 5, 18 శాతం శ్లాబులే ఉండే అవకాశాలు ఉన్నాయి. కానీ ఇప్పటికీ అమలులోనున్న జీఎస్టీ విధానంతో మోడీ సర్కార్ సామాన్యుల నుంచి అధిక మొత్తంలో పన్నులు వసూలు చేసింది. పదకొండేండ్ల ఎన్డీయే సర్కారు పాలనలో సామాన్యుడి జీతంలోని సింహభాగమంతా పన్నులకే పోయింది. 2014లో మోడీ ప్రధానిగా పగ్గాలు చేపట్టినప్పుడు కేంద్రానికి పన్నుల రూపంలో రూ.17.94 లక్షల కోట్ల మేర ఆదాయం వస్తే, 2025నాటికి అది రూ.50 లక్షల కోట్లు దాటింది. మొత్తంగా 11 ఏండ్లలో పన్నుల పేరిట రూ. 329 లక్షల కోట్లను మోడీ ప్రభుత్వం ప్రజల నుంచి వసూలు చేసింది. ఇక, 2017లో జీఎస్టీ అమల్లోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకూ వసూళ్లు మూడు రెట్లు పెరిగాయి. 2017-18లో రూ.7.41 లక్షల కోట్లుగా ఉన్న జీఎస్టీ వసూళ్లు 2024-25 నాటికి రూ. 22.08 లక్షల కోట్లకు చేరుకొన్నాయి. ఇన్నిరోజులూ ప్రజల నుంచి పన్నులను పిండుకొన్న మోడీ ప్రభుత్వం ఇప్పుడు తిరిగ్గా జీఎస్టీలో సంస్కరణలు తీసుకొస్తామని ప్రకటించడంతో మోసం చేశారని స్పష్టమవుతోంది. మోడీ సర్కార్ ఇప్పటికే అమలు చేస్తున్న జీఎస్టీ విధానంలో వ్యక్తిగత లైఫ్, హెల్త్, టర్మ్ బీమా పాలసీలపై 18శాతం అమలు చేస్తున్నారు. కానీ కొత్తగా అమలులోకి వచ్చే విధానంలో వీటిని జీఎస్టీ నుంచి తొలగిస్తున్నారు. వ్యక్తుల బీమా పాలసీల పట్ల ఉదారంగా వ్యవహరించాల్సిన మోడీ సర్కార్ ఇప్పటి వరకు 18శాతం జీఎస్టీ వసూలు చేసి ప్రజలను బీమా పాలసీలకు దూరం చేసిందని గుర్తించాలి. అలాగే 33 రకాల ప్రాణాధార ఔషధాలపై 12 శాతం జీఎస్టీ వేసింది. కొత్త విధానంలో వీటికి జీఎస్టీ నుంచి మినహాయింపు ఇవ్వనున్నారు. అంటే ఇంతకాలం సామాన్య ప్రజల ప్రాణాధార ఔషదాలపై 12శాతం జీఎస్టీ విధించి మోడీ సర్కార్ ప్రజల ఆరోగ్యంతో చెలగాట మాడిందనే చెప్పాలి. విద్య, వైద్యం, ఆహార భద్రత కల్పన ప్రభుత్వాల బాధ్యత. ఈ రకంగా చూసుకొంటే జీఎస్టీ పాత విధానంతో మోడీ సర్కార్ ఇన్నాళ్లపాటు దోపిడి చేస్తూ వస్తోందని భావించాలి. త్వరలో వివిధ రాష్ట్రాల ఎన్నికల నేపథ్యంలో ప్రజలకు చేరువయ్యే ఎత్తుగడ్డలో భాగంగానే జీఎస్టీ శ్లాబుల మార్పుతో మోడీ సర్కార్ జిమ్మిక్కులు ప్రారంభించింది. ఎందుకంటే 'ఓట్ చోర్ గద్దీ చోడ్' అన్న ఇండియా కూటమి ఉద్యమంతో ఎన్నికల్లో గెలిచే మరో మార్గం లేకపోవడంతోనే మోడీ జీఎస్టీ శ్లాబులను మార్చి పేద, సామాన్య ప్రజలకు ఉద్ధరిస్తున్నట్లు ప్రకటించుకొంటోంది. కొత్త జీఎస్టీ విధానంతో ఎన్నికల్లో లబ్ధిపొందాలన్న ఉద్దేశంతోనే వీటిని పెద్ద ఎత్తున్న ప్రచారం చేసుకొనేందుకు బీజేపీ, మోడీ సర్కార్ పెద్దలు ప్రయత్నాలు చేస్తున్నారు.

# విష జ్వరాలు రాకుండా తగిన చర్యలు తీసుకోవాలి.





మన గళండోన్ గ్రామాల్లో విష జ్వరాలు రాకుండా వైద్య సిబ్బంది తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా మలేరియా ఆఫీసర్ చంద్రశేఖర్ పేర్కొన్నారు. మండలంలోని కొచెర్వు గ్రామంలో మలేరియా, డెంగీ వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. చిన్న మల్కాపురం వైద్యాధికారి డాక్టర్ సూర్య ప్రకాష్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అనంతరం చిన్న మల్కాపురం, జలదుర్గం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జ్వరాలు పట్ల అప్రమత్తంగా ఉండాలని జ్వరాలు వచ్చిన వెంటనే స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సంప్రదించి వైద్య సేవలు పొందాలని అన్నారు. మన పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, డ్రై డే ఫ్రైడే తప్పక పాటించాలని సూచించారు. దోమలు కుట్టకుండా దోమతెరలు, వేపాకు పొగ,మస్కిటో కాయిల్స్ ఉపయోగించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మలేరియా ఆఫీసర్ సత్యనారాయణ, మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ రాజశేఖర్ రెడ్డి, ఎంపీహెచ్వో వేణుగోపాల్ రెడ్డి, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# చాకలి ఐలమ్మ 40 వ వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు..
# సిపిఐ జిల్లా కార్యదర్శి కామ్రేడ్ యన్ రంగ నాయుడు



మన గళండోన్ పట్టణంలోని సిపిఐ పార్టీ నక్కి రామన్న భవన్ లో నిజాం నిరంకుశ పాలన నుంచి విముక్తి కల్పించేందుకు పోరాటం చేసిన చాకలి ఐలమ్మ గారి 40వ వర్ధంతి సందర్భంగా సిపిఐ పార్టీ నంద్యాల జిల్లా కార్యదర్శి కామ్రేడ్ యన్ రంగ నాయుడు గారు జిల్లా కార్య వర్గ సభ్యులు రాధాకృష్ణ చేతివృత్తి దారుల జిల్లా కార్యదర్శి రామ్ మోహన్ పాల్గొన్నారు.వారు మాట్లాడుతూ దున్నేవాడిదే భూమి, అని సాగిన తెలంగాణసాయుధ పోరాటంలో చాకలి ఐలమ్మ నిప్పురవ్వ వంటిది ఎంతోమందిలో స్ఫూర్తి నింపి వారిని చైతన్య పరుస్తూ అటు రైతులను కూలీలను ఏకం చేసి ఉద్యమాలు చేసిన చరిత్ర తనది. వరంగల్ జిల్లాలోని కృష్ణాపురంలో పుట్టిన ఐలమ్మ భూమినే నమ్ముకుని పాలకుర్తిలో వ్యవసాయం చేస్తున్న రోజుల్లోనే నిజాం అరాచకాలను దొరల అణిచివేతలు ఎక్కువయ్యాయి అప్పటికే ఆంధ్ర మహాసభలలో చేరిన ఐలమ్మ ప్రజలపై జరుగుతున్న అరాచకాలకు అణిచివేతకు ఎదురు తిరిగి భయపడకుండా భూ పోరాటాన్ని సాగించింది . ప్రత్యర్థులు ఎన్ని దాడులు చేసినా ఆర్థికంగా ఎన్ని ఇబ్బందులకు గురిచేసిన తన పోరాటాన్ని ఐలమ్మ ఆపలేదు అలా ఐలమ్మ తొలి భూ పోరాటానికి నాంది పలికి చివరకు లక్షల ఎకరాల పంపకానికి కారణమైంది ఇలా అందరిలో స్ఫూర్తి నింపిన ఐలమ్మ వయోభారంతో 90 ఏళ్ల వయసులో 1985 సెప్టెంబర్ 10 న కన్నుమూసిందనీ వారు అన్నారు . ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యదర్శి మొట రాముడు ప్రజానాట్యమండలి నాయకులు నాగరాజు సిపిఐ జిల్లా సమితి సభ్యులు పులి శేఖర్ , చేతి వృత్తిదారుల డోన్ మండల కార్యదర్శి హరి, సిపిఐ సీనియర్ నాయకులు మల్లంపల్లి రంగస్వామి, రజాక్, మల్యాల గ్రామ శాఖ కార్యదర్శి ఈశ్వరయ్య సీసం గుంతల గ్రామ శాఖ కార్యదర్శి మనోహర్, వృత్తిదారుల సంఘం నాయకులు శేఖర్ పాల్గొన్నారు

# కోడుమూరు మండలంలోని వెంకటగిరి గ్రామ ఉల్లి రైతులను కలిసిన ఎమ్మార్వో మరియు ఎంపీడీవో





మన గళం కోడుమూరు: కోడుమూరు మండలంలోని వెంకటగిరి గ్రామానికి మండల తహసిల్దార్ మరియు మండల వ్యవసాయ అధికారి మరియు రైతు సేవ కేంద్రం సిబ్బంది వెంకటగిరి గ్రామ ఉల్లి రైతులతో సమావేశం అయ్యారు గ్రామ రైతులతో కలిసి వారి సమస్యలను తెలుసుకున్నారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం రైతులకు అండగా ఉంటుందని ప్రభుత్వం మద్దతు ధర క్వింటాలు 1200 ఏర్పాటు చేయడం జరిగినదని ఈ సందర్భంగా ఉల్లి రైతులకు తెలియజేశారు ఉల్లి పంటను కచ్చితంగా 120 రోజులు పొలంలో ఉండేటట్టు తర్వాత మాత్రమే పంటను తీయాలని తద్వారా కాయ నాణ్యత మరియు దిగుబడి పెరుగుని రైతులకు వారు సూచనలు అందించారు ఉల్లి పంట వేసిన రైతులు పంట నమోదు కచ్చితంగా చేయించుకుని తద్వారా ఎమ్మెస్పీ కి ప్రభుత్వానికి అమ్ముకోవడానికి వీలవుతుందని అలాగే ఉల్లి పంట వేసిన రైతులు ఆందోళన చెందకుండా ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను గ్రామాల్లో రైతులకు తెలపడం కోసము మండల తాసిల్దారు మరియు మండల వ్యవసాయ అధికారి మరియు రైతు సేవ కేంద్రం సిబ్బంది అన్ని విషయాలను రైతులకు తెలుపుతూ రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు అని మద్దతు ధర ఉన్నదని తెలుపుతూ గ్రామాల్లో పర్యటించారు ఈ కార్యక్రమంలో మండల అధికారులు మరియు రైతు సేవా కేంద్ర సిబ్బంది స్థానిక రైతులు పాల్గొన్నారు

# కోడుమూరు పట్టణంలోని ముస్లిం సహోదరుల స్మశానం
# వాటికలో బోర్ వేయించిన టీడీసీసీ చైర్మన్ మరియు ఎమ్మెల్యే





మన గళం కోడుమూరు: కోడుమూరు పట్టణంలో కే డి సి సి చైర్మన్ డి విష్ణువర్ధన్ రెడ్డి మరియు కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి ఆదేశాల మేరకు కోడుమూరు పట్టణంలోని ముస్లిం సహోదరుల స్మశానం వాటికలో బోర్ వేయించడం జరిగింది. కోడుమూరు పట్టణంలో ముస్లిం సోదరులు సోమవారం రోజు విష్ణువర్ధన్ రెడ్డి అలాగే బొగ్గుల దస్తగిరి కలిసి కోడుమూరు పట్టణంలో ముస్లిం సోదరుల స్మశాన వాటిక లో కాంపౌండ్ వాల్ మరియు నీటి సమస్య ఉందని వారు తెలిపారు వారి సమస్య విన్న తక్షణమే స్పందించి ప్రహరీ గోడకు సంబంధించి డిఈ మరియు ఏఈ తో మాట్లాడి వాటికి ఎస్టిమేషన్ వేయాలని ఆదేశాలు జారీ చేశారు అలాగే ఈరోజు బోర్ వెల్ వాహనాన్ని పంపి బోర్ వేయించడంతో ఒకటిన్నర ఇంచు నీరు కూడా పడ్డాయి, నీరు పడడంతో ముస్లిం సోదరులు ఎంతో ఆనందాన్ని వ్యక్తపరుస్తూ హర్షం వ్యక్తపరిచారు అలాగే తమ సమస్య విని విన్న వెంటనే తక్షణమే సమస్య పరిష్కారానికి పూనుకొని సమస్యను పరిష్కరించినందుకు వారు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి మరియు విష్ణువర్ధన్ రెడ్డికు ముస్లిం సోదరులంతా కృతజ్ఞతలు తెలిపారు ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు గంగాధర్ నాయుడు జిడిపి చైర్మన్ కే యీ మల్లికార్జున గౌడ్ ముస్లింలు తదితరులు పాల్గొన్నారు

## తెలుగువారిని సురక్షితంగా తీసుకొచ్చేందుకు చర్యలు



మనగళం, నంద్యాల : నేపాల్ లో చిక్కుకున్న తెలుగు వారిని సురక్షితంగా తీసుకురావడానికి జిల్లా యంత్రాంగం ప్రత్యేక చర్యలు చేపడుతోందని నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. జిల్లా కేంద్రం నంద్యాల కలెక్టరేట్ ప్రాంగణంలో కంట్రోల్ రూమ్ నెంబర్ :08514- 293903 ఏర్పాటు చేశామన్నారు. నేపాల్ లో ఉన్న భారతీయుల కోసం రాష్ట్ర ప్రభుత్వం హెల్ప్ లైన్ నంబర్ల ఏర్పాటు చేసిదని కలెక్టర్ తెలిపారు. అదేవిధంగా ఏపీకి చెందిన ప్రజల కోసం ఢిల్లీ ఏపీ భవన్ లో హెల్ప్ లైన్ నంబర్ ఏర్పాటు చేశారన్నారు. ఖాట్మండ్ హెల్ప్ లైన్ నంబర్లు: 977- 980 860 2881, 977- 981 032 6134, ఢిల్లీ హెల్ప్ లైన్ నంబర్లు: 98183 95787, 85000 27678, ఏపీఎన్ఆర్టీఎస్ హెల్ప్ లైన్ నంబర్: 0863 2340678 చొప్పున కేటాంచారని జిల్లా కలెక్టర్ వివరించారు.

## డ్రైవర్ల పోస్టుల ఇంటర్వ్యూలు పూర్తి

మనగళం, నంద్యాల: నంద్యాల జిల్లాకు సంబంధించి బుధవారం జిల్లా రవాణా అధికారి కార్యాలయం ఛాంబర్లో హెవీ మోటార్ వెహికల్ డ్రైవర్ పోస్టుల ఇంటర్వ్యూలు విజయవంతంగా నిర్వహించినట్లు జిల్లా ఎస్సీ కార్పొరేషన్ అధికారి కే.తులసీదేవి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ఇంటర్వ్యూలను జిల్లా రవాణా అధికారి, నంద్యాల ఆర్టీసీ డిపో మేనేజర్, డ్రైవింగ్ ఇన్‌స్ట్రక్టర్, ఆఫీస్ సూపరింటెండెంట్ (నంద్యాల డిపో), ఎస్సి కార్పొరేషన్ కర్నూలు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌లతో కూడిన కమిటీ ఆధ్వర్యంలో పారదర్శకంగా నిర్వహించినట్లు తెలిపారు. మొత్తం 14 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా, 12 మంది ఇంటర్వ్యూకు హాజరయ్యారన్నారు. వారిలో 10 మందిని ఎంపిక చేశామన్నారు. ఒక మహిళా అభ్యర్థి ఉన్నారని చెప్పారు. డ్రైవింగ్ లైసెన్స్ సీనియారిటీ మరియు వయస్సు ప్రమాణాల ఆధారంగా ఎంపిక జరిగిందని ఆ ప్రకటనలో పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా రవాణా అధికారి శివశంకర్ రెడ్డి, ఆర్టీసీ డిఎం వినయ్ కుమార్, డ్రైవింగ్ స్కూల్ ఇన్స్ట్రక్టర్ ఏ సుధాకర్ ఎస్సీ కార్పొరేషన్ ఈవో ఎం విజయలక్ష్మి, దరఖాస్తుదారులు తదితరులు పాల్గొన్నారు.

## ఆదోని జిల్లా ఏర్పాటుకు సహకరించండి



**- మంత్రి నిమ్మల రామానాయుడికి ఎమ్మెల్యే పార్థసారథి వినతి**

మనగళం, ప్రత్యేక ప్రతినిధి: ఆదోని జిల్లా ఏర్పాటుకు సహకరించాలని కోరుతూ ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి కర్నూలు జిల్లా ఇన్చార్జి మంత్రి నిమ్మల రామానాయుడికి వినతి పత్రం అందజేశారు. అనంతపురంలో బుధవారం నిర్వహించిన సూపర్ సిక్స్... సూపర్ హిట్ భారీ బహిరంగ సభకు హాజరైన మంత్రికి ఎమ్మెల్యే వినతి పత్రం అందజేశారు. అదేవిధంగా ఆదోనిని నాలుగు మండలాలుగా విభజించాలని ఎమ్మెల్యే కోరారు.

## 17న విజయవాడలో నిరుద్యోగుల ఆవేదన సదస్సు

మనగళం, పత్తికొండ : విజయవాడలో ఈ నెల 17వ తేదీన నిరుద్యోగుల ఆవేదన రాష్ట్రస్థాయి సదస్సు నిర్వహిస్తున్నట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు తెలిపారు. ఈ మేరకు బుధవారం పత్తికొండలో సదస్సుపై ఏఐవైఎఫ్ జిల్లా ఆఫీస్ బేవర్స్ సమావేశం నిర్వహించారు. నిరుద్యోగ యువతపై ప్రభుత్వాల నిర్లక్ష్యం వీడేందుకు చేపట్టనున్న సదస్సును విజయవంతం చేయాలని ఈ సందర్భంగా వారు పిలుపునిచ్చారు. సమావేశంలో ఏఐవైఎఫ్ మాజీ జిల్లా కార్యదర్శి కారుమంచి, జిల్లా ఆఫీస్ బేరర్స్ హనుమేష్, రమేష్, రాజీవ్, రాజు, నాయకులు పెద్దయ్య, ఉపేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించండి

**- జాయింట్ కలెక్టర్ సి విష్ణు చరణ్**




మనగళం, నంద్యాల: జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా ప్రణాళిక రూపొందించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ సి.విష్ణు చరణ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ లో జిల్లా జాయింట్ కలెక్టర్ సి విష్ణు చరణ్ డిస్టిక్ స్కిల్ డెవలప్మెంట్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులకు ఆసక్తి గల రంగాలలో నైపుణ్యాలను పెంపొందించి ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా పకడ్బందీ ప్రణాళిక రూపొందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రధానంగా గ్రామీణ, గిరిజన ప్రాంతాలలో ఉన్న నిరుద్యోగ యువతకు శిక్షణ కార్యక్రమాలను పెంపొందించి ఉపాధి కల్పించే దిశగా కోర్సులను గుర్తించాలన్నారు. జిల్లాలోని పెద్ద పెద్ద పరిశ్రమలను సంప్రదించి వారి అవసరాలకు అనుగుణంగా నిరుద్యోగ యువతీ యువకులకు శిక్షణ ఇప్పించి ఉద్యోగ అవకాశాలను కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో ఉన్నటువంటి స్కిల్ హబ్స్, జాబ్ మేళాల గురించి చర్చించారు. జిల్లాకు కేటాయించిన టార్గెట్స్ గడువులోపు పూర్తిచేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డీఆర్డిఏ పీడీ శ్రీధర్ రెడ్డి, జిల్లా నైపుణ్యాభివృది సంస్థ అధికారి, సీడాప్ సీడ్ ఆప్ సిబ్బంది పాల్గొన్నారు.

## కోడుమూరులో సిపిఐ ఆధ్వర్యంలో కామ్రేడ్ సురవరం సుధాకర్ రెడ్డి సంస్మరణ సభ





మన గళం కోడుమూరు: కోడుమూరు పట్టణంలో సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో, స్నేహ వినాయక కళ్యాణ మండపంలో, కామ్రేడ్ సురవరం సుధాకర్ రెడ్డి గారి సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సభకు సిపిఐ పట్టణ కార్యదర్శి డి శేష్ కుమార్ అధ్యక్షత వహించగా ,ముఖ్య ఆహ్వానితులుగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పి రామచంద్రయ్య ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కే జగన్నాథం గారు, చేతివృత్తుల దారుల సంఘం జిల్లా కార్యదర్శి కారన్నగారు,,సిపిఐ జిల్లా సమితి సభ్యులు, కోడుమూరు సిపిఐ సీనియర్ నాయకులు, బి కృష్ణ ఆధ్వర్యంలో జరిగింది ఈ సందర్భంగా వచ్చిన ముఖ్య అతిథులంతా ముందుగా వారు సుధాకర్ రెడ్డి గారికి పూలదండ వేసి పూలు వేసి నివాళులర్పించారు ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పి రామచంద్రయ్య మాట్లాడుతూ కామ్రేడ్ సురవరం సుధాకర్ రెడ్డి గారి, త్యాగం వృధా కాదని, వారి ఆశయాలను కొనసాగిస్తామని, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పి రామచంద్రయ్య తెలియజేశారు కామ్రేడు సురవరం సుధాకర్ రెడ్డి విద్యార్థి దశ నుండే కర్నూలు ఉస్మానియా కాలేజీలో చదువుతూ, అత్యంత స్థానం సంపాదించి, విద్యార్థి, యువజన నాయకుడిగా పని చేస్తూ, సిపిఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఎనలేని సేవలు చేశారని వారు కొనియాడారు. ఆయన రెండుసార్లు నల్లగొండలో ఎంపిక గెలిచి ఏనాడు కూడా పదవులు ఆశించలేదని, ఆయన మరణించిన, తర్వాత, దేహంలో ఉన్న అవయవాలను ఇతరులకు ఉపయోగపడాలని తన దేహం వైజ్ఞానానికి ఉపయోగపడాలని, తనకు ఉన్నటువంటి ఆస్తిని కూడా పేద ప్రజలకు ఉపయోగపడే విధంగా నిర్ణయించి, స్వర్గస్తులయ్యారని అటువంటి గొప్ప సంఘ సంస్కర్త కామ్రేడ్ సురవరం సుధాకర్ రెడ్డి అని ఆయన ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పి రామచంద్రయ్య పేర్కొన్నారు అనంతరం ముఖ్య అతిథులుగా విచ్చేసిన శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం ఆలయ కమిటీ చైర్మన్ ,ఎద్దుల మహేశ్వర్ రెడ్డి, కోడుమూరు తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, కే హేమాద్రి రెడ్డి, టిడిపి మధుసూదన్ రెడ్డి, వైయస్సార్సీపి నియోజకవర్గ నాయకులు ఆదిమూలపు సతీష్, జెడ్పిటిసి రఘునాథ్ రెడ్డి సిపిఐ మండల కార్యదర్శి బి రాజు, సిపిఎం సీనియర్ నాయకులు , గపూర్మియా, చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు, బి మాధవ స్వామి, ఏఐటీయూసీ మండల కార్యదర్శి చిన్న రాముడు, ప్రైవేట్ స్కూల్ అసోసియేషన్ నాయకులు ఇంతియాజ్ భాష, ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు రంగస్వామి వీరందరూ ఈ సందర్భంగా మాట్లాడుతూ కామ్రేడ్ సురవరం సుధాకర్ రెడ్డి చేసిన ప్రజాసేవలను గుర్తుంచుకోవాలని ఆయన గొప్ప మహానీయుడని అటువంటి వ్యక్తికి ఈరోజు మనం నివాళులర్పించడం మన అదృష్టం అని వారందరూ పేర్కొన్నారు సురవరం సుధాకర్ రెడ్డి చేసిన సేవలను గుర్తు చేసుకొని వారిని అందరూ ప్రశంసించారు ఇందులో భాగంగా కమ్యూనిస్ట్ ఉద్యమల దిగ్గజం కామ్రేడ్ సురవరం సుధాకర్ రెడ్డి క్షణక్షణం కమ్యూనిజం అదే విధంగా ఆయన నరం నరం నవతరం నిర్మాణం కోసం పోరాటం నడిపారని సిపిఐ పార్టీ పట్టణ కార్యదర్శి శేషుకుమార్ అన్నారు ఈ కార్యక్రమంలో ముస్లిం మైనార్టీ నాయకులు ఆర్ కాజా, ముస్తాపలు, ఇతర ప్రజా సంఘాల నాయకులు ఆటో మధు, వెంకటస్వామి ఆచారి, ఏపీ మహిళా సమైక్య నాయకురాలు సులోచనమ్మ ,మహిళలు ఈరమ్మ ,బాలమ్మ, గూడూరు మండల కార్యదర్శి బిడిల శ్రీనివాసులు, గొల్ల రాజు, బాలు, వర్కులు రైతు సంఘం నాయకులు, మునిస్వామి, రంగన్న, మా భాష స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

# పరిశ్రమల ఏర్పాటుకు అనుమతులు జారీ చేయండి

**- జిల్లా జాయింట్ కలెక్టర్ సి.విష్ణు చరణ్**




మనగళం, నంద్యాల: సింగిల్ డెస్క్ విధానం ద్వారా జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు ఔత్సాహిక పారిశ్రామికవేత్తల నుండి అందిన దరఖాస్తులకు త్వరితగతిన అనుమతులు జారీ చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ సి. విష్ణు చరణ్ సంబంధిత అధికారులకు సూచించారు. బుధవారం కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నందు జిల్లా జాయింట్ కలెక్టర్ సి. విష్ణు చరణ్ జిల్లా పరిశ్రమలు, ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ జిల్లాలో గత త్రైమాస కాలంలో వివిధ పరిశ్రమల స్థాపనకు అనుమతులు కోరుతూ మొత్తం 1,094 దరఖాస్తులు అందగా సింగల్ డిస్క్ విధానంలో ఆయా శాఖల ద్వారా 1076 పరిశ్రమలకు అనుమతులు మంజూరు చేశారన్నారు. ఇంకా మిగిలిన 17 దరఖాస్తులను నిర్దిష్ట గడువులోపు తగిన పరిష్కారం చూపాలని అధికారులకు సూచించారు. జిల్లాలో చిన్న మధ్యతరహా పరిశ్రమల ప్రోత్సాహం కొరకు పెట్టుబడి రాయితీ పావలా వడ్డీ విద్యుత్తు సేల్ టాక్స్ తదితర రాయితీల కింద జిల్లాలో ఉత్పాదన సేవా రంగాల్లోని 20 యూనిట్లకు మొత్తం 350.48 లక్షల విలువైన రాయితీ ప్రయోజనాల జారీకి కమిటీ ఆమోదం తెలియజేసింది. ఈ సమావేశంలో సభ్యులకు నూతనంగా ప్రవేశపెట్టిన పారిశ్రామిక విధానాల ఆచరణ కొరకు విడుదల చేసిన విధి విధానాలను వివరించి నూతన పరిశ్రమల స్థాపనకు వారు సహకరించవలసిందిగా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ అభ్యర్థించారు. కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ ఎస్ మహబూబ్ బాషా, ఎల్డీఎం రవీంధర్ కుమార్, డిప్యూటీ చీఫ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ నారాయణరెడ్డి, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ కిషోర్ రెడ్డి వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# భారత్‌లో 100 మంది ఉద్యోగులను తొలగించిన ఒరాకిల్

మనగళం, : టెక్ కంపెనీల్లో ఉద్యోగాల కోతలు కొనసాగుతున్నాయి. ఈ ఏడాది ఇప్పటికే మైక్రోసాఫ్ట్, అమెజాన్, మెటా సహా పలు కంపెనీలు పెద్ద ఎత్తున లేఆఫ్‌లు ప్రకటించాయి. ఇందులో భాగంగా ఒరాకిల్ కూడా భారత్‌లో ఉద్యోగులను తొలగించింది. పునర్నిర్మాణంలో భాగంగా కంపెనీ భారత్‌లోని 100 మందికి పైగా ఉద్యోగులకు లేఆఫ్‌కు సంబంధించి లేఖలు పంపినట్టు సమాచారం. ఈ తొలగింపులు క్లౌడ్ విభాగంతో పాటు అన్ని విభాగాల్లోని ఉద్యోగులపై ప్రభావం చూపాయి. సంస్థాగత మార్పులలో భాగంగా ఈ తొలగింపు నిర్ణయం తీసుకునాం. తొలగించిన ఉద్యోగులకు 15 రోజుల జీతంతో పాటు ఏడాది వరకు వైద్య బీమా కవరేజీ అందిస్తామని కంపెనీ లేఖలో పేర్కొంది. ఈ లేఆఫ్‌లో 15-20 ఏళ్ల అనుభవం ఉన్న ఉద్యోగులు కూడా ఉండటం గమనార్హం. కంపెనీ నిర్ణయాన్ని కొందరు ఉద్యోగులు ఆకస్మిక నిర్ణయమని అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా ఏఐ వినియోగం పెరగడం, కంపెనీ ఖర్చులను తగ్గించుకునే ప్రయత్నాల్లో ఉండటం లాంటి మార్పుల కారణంగా ఈ నిర్ణయం తీసుకుందని కొందరు ఉద్యోగులు పేర్కొన్నారు. కృత్రిమ మేధస్సు(ఏఐ), సామర్థ్యాన్ని పెంచుతున్నందున ఒరాకిల్ ప్రపంచవ్యాప్తంగా 3,000 మందికి పైగా సిబ్బందిని తొలగించిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం భారత్‌లో కంపెనీకి 30 వేల మంది ఉద్యోగులున్నారు.

# మంత్రులు, నేతలతో డైరెక్టర్ నగరూరు రాఘవేంద్ర భేటీ

- నగరూరును సన్మానించిన రాష్ట్ర భాజపా అధ్యక్షుడు పి.వి.ఎన్.మాధవ్
- నగరూరుకు అభినందనల..వెల్లువ







(మన గళం,కర్నూలు రైల్వేస్టేషన్) : ఏ.పి.ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ నగరూరు రాఘవేంద్ర బుధవారం పలువురు రాష్ట్ర మంత్రులు,భాజపా నేతలతో భేటీ అయ్యారు. ఈ నేపథ్యంలో ఆయన బిజీ,బిజీగా మారారు. అనంతపురం లో కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేసిన సూపర్ హిట్..సూపర్ సిక్స్ భారీ బహిరంగ సభ కార్యక్రమానికి హాజరైన సందర్భంగా ఆయన మంత్రులు,నేతలను కలిశారు. ఈ క్రమంలో ఆయన మంత్రులు,నేతలకు శాలువాలు కప్పి,పుష్పగుచ్ఛాలనందజేశారు. తనకు డైరెక్టర్ గా నియమితుడయ్యేందుకు సహకరించిన వారందరికీ ఆయన ధన్యవాదాలు తెలిపారు. డైరెక్టర్ రాఘవేంద్రను రాష్ట్ర భాజపా అధ్యక్షుడు పి.వి.ఎన్.మాధవ్ శాలువాతో సత్కరించి, అభినందించారు. తాను చేపట్టిన పదవికే వన్నె తెచ్చేలా వ్యవహరించాలని డైరెక్టర్ నగరూరు రాఘవేంద్రకు సూచించారు. డైరెక్టర్ నగరూరు రాఘవేంద్ర కలిసిన వారిలో మంత్రి సత్యకుమార్ యాదవ్, భాజపా నేతలు సందిరెడ్డి శ్రీనివాస రెడ్డి,చిరంజీవి రెడ్డి, ఆదినారాయణ రెడ్డి,తదితరులున్నారు.

# బాధితురాలి..ఆవేదన

- న్యాయం చేయాలంటూ...వినతి



(మన గళం,కర్నూలు అశోక్ నగర్) : తనకు న్యాయం చేయాలంటూ..ఓ మహిళ కోరుతున్నారు. తనకు తీరని అన్యాయమే జరిగిందని తాను వాపోతున్నారు. తాను నమ్ముకున్న తన భర్త, మరో మహిళ కలిసి తనను మానసికంగా, ఆర్థికంగా వే(బా)ధిస్తున్నారంటూ ఆమె ఆక్రోశాన్ని వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోకి వెళితే..కర్నూలు నగరంలోని స్థానిక బాలాజీ నగర్ లో నివాసముంటున్న మేరమ్మ(67) ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో హెడ్ నర్స్ గా విధులు నిర్వర్తిస్తూ 2012 లో పదవీ విరమణ పొందారు. తన భర్త శ్యామ్యూల్ ఓ బ్యాంకులో మెసెంజర్ గా పని చేస్తూ, 2024లో పదవీ విరమణ పొందారు. ఆ దంపతులకు 1 కుమారుడు,2 కూతుర్లున్నారు. అయితే...గత 30 ఏళ్లుగా తన భర్త శ్యామ్యూల్ తనను, తమ పిల్లల ఆలనా,పాలనను విస్మరించి, కనీసం జీతమివ్వకుండా, తమను పోషించకుండా తన సొంతానికే జీతాన్ని వాడుకునేవారని బాధితురాలు మేరమ్మ ఆరోపించారు. దీంతో పిల్లల చదువులు,పోషణ,పెళ్లిళ్లు...తదితర కార్యాలన్నీ తన జీతంతోనే నిర్వర్తించానని ఆమె చెప్పారు. తన భర్త తన జీతం ఇవ్వకపోగా తమకున్న ఇంటిని సైతం అమ్మి డబ్బు వాడుకున్నాడని ఆమె చెప్పారు. దీంతో పాటు ఇంట్లో బీరువాలో దాచుకున్న డబ్బు,నగలు సైతం తీసుకుని ఓ మహిళకు ఇచ్చారన్నారు. దశాబ్దాల కాలం పాటు తమను తమ భర్త పట్టించుకోక పోగా, మళ్లీ తన పదవీ విరమణానంతరం సైతం ఆయనకు ప్రభుత్వం నుంచి వచ్చిన డబ్బు సైతం ఇవ్వక, ఉపాధ్యాయురాలిగా పని చేస్తున్నపరిచయస్తురాలైన ఓ మహిళకు దాదాపుగా రూ.40 లక్షల నగదు ఇచ్చారన్నారు. ఈ ముదిమి వయసులో తాను ఒంటరిగా ఉండాల్సి వస్తుందని, ఆ డబ్బు కుటుంబ శ్రేయస్సుకు వెచ్చించక వేరే మహిళకు ఇవ్వడం అన్యాయమని బాధితురాలు వాపోయారు. ఊరంతా అప్పులు చేసి, తన భర్త తనను పట్టించుకోవడం లేదని, అప్పులోళ్లు ఇంటి వద్దకు వచ్చి కూర్చుంటున్నారని,, తానెక్కడి నుంచి ఆ అప్పులు తీర్చగలనని ఆమె కన్నీటి పర్యంతమవుతున్నారు. పోలీసులకు ఫిర్యాదు చేద్దామని గతంలోనే అనుకున్నా, కొందరు దుర్భాషలాడారని, అందుకే తాను ఆ ప్రయత్నాన్ని విరమించుకున్నానని చెప్పారు. మరి..ఆ బాధిత మహిళకు న్యాయం చేసేదెవ్వరో ?..అస్సలు...న్యాయం జరిగెదెన్నడో..?..కాలమే నిర్ణయించా

# పిడుగుపాటకు ముగ్గురు మృతి

మనగళం, ప్రత్యేక ప్రతినిధి : జోగులంబా గద్వాల్ జిల్లా అయిజ మండలం భూంపురం గ్రామంలో పిడుగుపాటకు ముగ్గురు మృతి చెందారు. పొలంలో సీడ్ పత్తి పని చేసుకుంటుండగా పిడుగు పడి ఇద్దరు మహిళలతోపాటు యువకుడు మృతి చెందారు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. 6 మంది సంతోషంగా పొలంలో సీడ్ పత్తి పనులు చేసుకుంటుండగా... ఒక్కసారిగా వర్షం రావడంతో... సమీపంలోని తాటిచెట్టు వద్దకు వెళ్లారు. ఒక్కసారిగా పిడుగు పడింది. దీంతో భూంపురం పురం గ్రామానికి చెందిన పార్వతమ్మ (22) సర్వేస్ (20), సౌభాగ్య (40) మృతి చెందారు. సమీప పంట పొలాల రైతులు స్పందించి వైద్యం కోసం... అయిజ సాయి శివ హాస్పిటల్ కు తరలించారు. ఒకేసారి ముగ్గురు మృతి చెందడంతో భూంపురం గ్రామంలో విషాధఛాయలు అలుముకున్నాయి. గాయపడిన ఇద్దరు వ్యక్తులను గద్వాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు.





# వారంలో మూడు రోజులు ఆఫీసుకు రావాల్సిందే..

మనగళం, : వర్క్ ఫ్రమ్ హెూమ్‌కు స్వస్తి పలుకుతూ ఐటీ కంపెనీలు ఉద్యోగులను కార్యాలయాలకు రప్పించే పనిలో పడ్డాయి. తాజాగా అందులో టెక్ దిగ్గజ సంస్థ మైక్రోసాఫ్ట్ కూడా చేరింది. ఉద్యోగులు వచ్చే ఏడాది నుంచి వారంలో కనీసం మూడు రోజులైనా ఆఫీసుకి రావాల్సిందేనని తేల్చి చెప్పింది. ఈ మేరకు బ్లాగ్‌లో ఓ పోస్టు పెట్టింది. ఈ విధానాన్ని మూడు దశల్లో అమలుచేయనున్నట్లు మైక్రోసాఫ్ట్ చీఫ్ పీపుల్ ఆఫీసర్ అమీ కోల్‌మాన్ బ్లాగ్‌లో పేర్కొన్నారు. తొలుత వాషింగ్టన్, రెడ్‌మండ్ కంపెనీ ప్రధాన కార్యాలయంలోని ఉద్యోగులతో దీన్ని మొదలుపెట్టనున్నట్లు తెలిపారు. ఆ తర్వాత ప్రపంచవ్యాప్తంగా ఉన్న కార్యాలయాల్లో ఇదే విధానం అమలవుతుందని వెల్లడించారు. కంపెనీ ప్రధాన కార్యాలయం నుంచి 50 మైళ్ల దూరంలో నివసించే ఉద్యోగులకు 2026 ఫిబ్రవరి చివరి నుంచి ఈ విధానం అమలుకానున్నట్లు వివరించారు. ఈ క్రమంలో అమెరికాలోని మిగిలిన ప్రాంతాల్లో ఉన్న ఉద్యోగులు కార్యాలయాలకు వచ్చే విషయానికి సంబంధించిన వివరాలను త్వరలోనే వెల్లడిస్తామని తెలిపారు.




మహమ్మారి సమయంలో మొదలైన వర్క్ ఫ్రం హెూమ్ కల్చర్ నుంచి దాదాపు అన్ని కంపెనీలు బయటకు వస్తున్నాయి. తమ ఉద్యోగుల్ని తిరిగి ఆఫీసులకు రప్పించేందుకు ఐటీ సంస్థలు అనేక చర్యలు చేపడుతున్నాయి. హెచ్‌సీఎల్, అమెజాన్, ఇన్ఫోసిస్, టీసీఎస్‌వంటి కంపెనీలు ఇప్పటికే ఉద్యోగులను ఆఫీసుకు వచ్చి పనిచేసేలా ప్రోత్సహిస్తున్నాయి.

Editor, Printed, Published and Owned by S. T. KHALEEL BASHA. H.NO. 46-156-E2, BUDHAVAR PETA, KURNOOL DIST. A.P. - 518004.
PRINTED AT G.K PUBLICATIONS, BANDIMETTA STREET, KURNOOL DIST. AP- 518004, RNI : APTEL/ 2017/74310